
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 20 అక్టోబరు 2024







కృష్ణా తీరంలో డ్రోన్ షో

22, 23 తేదీల్లో డ్రోన్ సమ్మిట్‌కు ఏర్పాట్లు

పున్నమి ఘాట్‌లో 5 వేల డ్రోన్లతో ఇల్యూమినేటెడ్ ప్రదర్శన

- ఆకాశంలో అద్భుత చిత్రాల ఆవిష్కరణ
- పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ
- వీటితో పాటు వీ అన్‌బీటబుల్ డాన్స్ షో
- కృష్ణానదిని కప్పేసేలా లేజర్ షో

8

ఏర్పాట్లు పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్, సీపీ

కళ్లు మిరుమిట్లు గొలిపే డ్రోన్ షోకు బెజవాడ వేదిక కానుంది. ఐదేళ్ల తర్వాత బెజవాడలో మళ్లీ నగరవాసులకు మంచి వినోదాన్ని పంచే ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్ జరగబోతోంది. ఈ నెల 22న పున్నమి ఘాట్ వేదికగా జరిగే డ్రోన్ షోకు అందరూ ఆహ్వానితులే! కృష్ణమ్మ చెంతన భారీ ఎత్తున నిర్వహించే 'డ్రోన్ షో' గతంలో జరిగిన ఈవెంట్ల కంటే సమ్‌థింగ్ స్పెషల్‌గా నిలవనుంది. ఒకటా రెండా ఐదు వేల డ్రోన్లు ఆకాశంలో చేసే విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. ఇల్యూమినేటెడ్ వెలుగు జిలుగులతో ఆకాశంలో ఛాయాచిత్రాలను ఆవిష్కరించనుంది. అంతర్జాతీయ టాప్ షోలలో డ్రోన్ షో ఇప్పుడు అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రపంచంలోనే అతి పెద్ద డ్రోన్ షోలలో విజయవాడ ఈవెంట్ కూడా ఒకటి కాబోతోంది. రాష్ట్రాన్ని డ్రోన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఈ నెల 22, 23 తేదీల్లో మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో డ్రోన్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్న నేపథ్యంలో డ్రోన్ షోను కృష్ణాతీరంలో నిర్వహిస్తున్నారు.

నీటి విడుదలపై ఆశలు

ఈ ఏడాది రబీ సీజన్‌లో కృష్ణాడెల్టాకు వరి సాగు నిమిత్తం నీటిని విడుదల చేసే అంశంపై ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకుంటుందని రైతులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఈ నెలాఖరుతో ఖరీఫ్ సీజన్ ముగియనుంది. నవంబరు 15 నుంచి ఎగువ ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమవుతాయి. ఈలోగానే రబీ సీజన్‌లో వరి సాగుకు నీటిని విడుదల చేసే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేస్తే రబీ సీజన్‌లో ఏ రకం పంటలు సాగు చేయాలనే అంశంపై రైతులు నిర్ణయం తీసుకు నేందుకు వీలుంటుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించక ఖరీఫ్‌లో వరి దిగుబడులు తగ్గినా, రబీలో వరి సాగు చేసి కొంతమేర ఆర్థికంగా నిలదొక్కు కునేందుకు అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.


వరిపొలం

జిల్లాలో 50 వేల హెక్టార్లలో వరి సాగుకు అవకాశం

- రబీపై ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న రైతులు
- ఖరీఫ్‌లో దిగుబడులు తగ్గినా రబీతో ఆర్థిక వెసులుబాటుకు అవకాశం
- కృష్ణానదికి నేటికీ కొనసాగుతున్న వరద

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కృష్ణానదికి 11.42 లక్షల క్యూసెక్కుల వరకు వరద నీరు వచ్చింది. భారీ వర్షాలకు తోడు బుడమేరు పొంగి ప్రవహించడంతో గన్నవరం, ఉంగుటూరు, పెదపారుపూడి, బాపులపాడు, నందివాడ, గుడివాడ, మచిలీపట్నం, చల్లపల్లి తదితర మండలాల్లో 50 వేల హెక్టార్లకుపైగా వరిపంట నీట మునిగి దెబ్బతింది. కొందరు రైతులు భూమిని ఖాళీగా ఉంచలేక తక్కువ వ్యవధిలో కోతకు వచ్చే వరి వంగడాలను సాగుచేశారు. అధిక ధరకు వరినారు కొనుగోలు చేసి పలుచగా వరినాట్లు వేశారు. వరిపైరు నీట మునిగిన ప్రాంతాల్లోని పొలాల్లో వరిపైరు కొంతమేర ఉండగా, ఈ ఏడాది ఎకరానికి 12 నుంచి 15 బస్తాల ధాన్యం దిగుబడి మాత్రమే వస్తుందని రైతులు, వ్యవసాయశాఖ అధికారుల అంచనా వేస్తున్నారు. ధాన్యం దిగుబడులు ఈ ఏడాది తక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో రబీ సీజన్‌లో దాళ్వా పంటకు సాగునీటిని విడుదల చేస్తే వరి సాగు చేసుకుంటామని రైతులు అంటున్నారు.

కొనసాగుతున్న వరద

ఈ ఏడాది ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా ఉన్నాయి. దీంతో నేటికీ కృష్ణానదికి వరద కొనసాగుతూనే ఉంది. ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఉన్న పులిచింతల, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులలో పుష్కలంగా నీరు అందుబాటులో ఉంది. అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను దృష్టిలో పెట్టుకుని కృష్ణాడెల్టాకు రబీ సీజన్‌లో నీటిని విడుదల చేస్తారా, లేదా అనే అంశంపై రైతుల్లో కొంత అయోమయం నెలకొంది. వచ్చేఏడాది ఖరీఫ్ సీజన్‌కు విత్తనాల అవసరాలను తీర్చేందుకు కంకిపాడు, గన్నవరం, ఉయ్యూరు తదితర ప్రాంతాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌కు ఉపయోగమైన వరి వంగడాలను సాగు చేస్తారు. విత్తనాలుగా ఉపయోగించే వరి వంగడాలకు మార్కెట్‌లో మంచి ధర కూడా పలుకుతుంది. దీంతో రైతులు ఆరుతడి పంటలకు బదులుగా వరి సాగుపై ఆసక్తి చూపుతారు. రబీ సీజన్‌కు సాగునీరు విడుదల చేసే అంశంపై త్వరితగతిన ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేస్తే నారు మడులు ముందస్తుగానే పోసుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో వరి సాగుకు, వేసవిలో తీర ప్రాంతంలోని గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలకు సుమారుగా 45 టీఎంసీల నీరు సరిపోతుంది.

సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయం తీసుకుంటేనే..

ప్రతి ఏటా సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో ఏయే ప్రాంతాలకు రబీ సీజన్‌లో వరిసాగుకు అనుమతులు ఇవ్వాలి, వరిపంట సాగు కోసం, తీర ప్రాంతంలో వేసవిలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు మిగతా 6లో..



మళ్లీ భారీగా వరద

ఎగువ నుంచి 84,297 క్యూసెక్కుల నీరు రాక

- సముద్రంలోకి 77,750 క్యూసెక్కులు
- వివిధ కాల్వలకు నీటి విడుదల

విజయవాడ/చిట్టినగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీకు మళ్లీ వరద ప్రవాహం మొదలైంది. ఎగువ నుంచి 84,297 క్యూసెక్కుల నీరు వస్తోంది. సెప్టెంబరు ఒకటో తేదీన ప్రకాశం బ్యారేజ్‌కి రికార్డు స్థాయిలు 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి 40 వేల క్యూసెక్కుల వరద కొనసాగుతూనే ఉంది. శనివారం ఒక్కసారిగా ఇది మరింతగా పెరిగింది. పులిచింతల నుంచి 84,237 క్యూసెక్కుల నీరు వస్తోంది. బ్యారేజ్ 40 గేట్లను రెండు అడుగులు, 30 గేట్లను ఒక అడుగు మేరకు ఎత్తి 77,750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కేఈ మెయిన్ కెనాల్‌కు 4,028, కేడబ్ల్యూకి 2,519, కాల్వలకు 6,547 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

వరద ప్రవాహం పెరగడంతో వీఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. వరద సంబంధిత ఫిర్యాదుల కోసం వీఎంసీలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర అధికారులతో సమావేశం నిర్వహించారు. లోతట్టు ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పెరుగుతున్న వరదల నేపథ్యంలో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

అమరవీరుల సంస్మరణ దినం చురుగ్గా ఏర్పాట్లు





విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 21న అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించడానికి చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. వీటిని డీజీపీ సీహెచ్.ద్వారకాతిరుమలరావు శనివారం పరిశీలించారు. పటిష్ట భద్రత, ట్రాఫిక్ చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఐజీలు శ్రీకాంత్, రాజకుమారి, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, డీఐజీ అమ్మిరెడ్డి తదితరులు ఉన్నారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ


ఇసుక రీచ్



తీర గ్రామాల్లో ఇసుక పండుగ

ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లలో ఉచితంగా తీసుకెళ్లమనడంపై సర్వత్రా హర్షం

రీచ్‌ల నుంచి ఎద్దుల బండ్లతో పాటు ట్రాక్టర్ల ద్వారా కూడా ఉచితంగా ఇసుక తీసుకువెళ్లేందుకు సీఎం చంద్రబాబు అనుమతి ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం సాహసోపేత నిర్ణయంతో అందరికీ ఇసుక తక్కువ ధరకు అందుబాటులోకి రానుంది. సామాన్యుల గృహ నిర్మాణ కష్టాలు తీరడంతో పాటు కూలీల ఉపాధికి ఇక ఢోకా ఉండదని తెలిసి తీర గ్రామాల్లో ప్రజలు ఇసుక పండుగ జరుపు కుంటున్నారు.

- సీఎం చంద్రబాబు సాహసోపేత నిర్ణయానికి కృతజ్ఞతలు
- గ్రామాలు, పట్టణాల్లో తక్కువ ధరకే లభించనున్న ఇసుక
- తీరనున్న సామాన్యుల ఇంటి నిర్మాణ కష్టాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఎన్‌టీఆర్ జిల్లాలో నందిగామ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. కృష్ణానదితో పాటుగా పాలేరు, వైరాయేరు, కట్లేరు, మునేరు ప్రవహిస్తుండటంతో ఇసుకకు ఎలాంటి కొరత లేదు. అయినప్పటికీ తీర గ్రామాల్లో ఇసుక మిగతా 6లో..

పేరుకే.. పంట కాలువ!

వర్షాకాలంలోనూ సాగుకు నీరందక వలివర్తిపాడు రైతుల అవస్థలు

- గుర్రపు డెక్క, ఇంగ్లీషు గడ్డితో పూడిక

6లో

సూరీడే తగలని చిరు ప్రాయం



- అర్ధరాత్రి వరకు చదువులు, టీవీలు, ఫోన్లు
- బారెడు పొద్దెక్కే వరకు మంచాలపైనే
- అధికశాతం చిన్నారుల్లో విటమిన్ డి లోపం
- పెలుసుబారుతున్న ఎముకలు
- పెరుగుతున్న ఆస్టియో ఫోరోసిస్ బాధితులు
- నేడు ప్రపంచ ఆస్టియో ఫోరోసిస్ దినోత్సవం

8లో

క్లాప్ బంద్!

నగరాలు, పట్టణాల్లో నిలిచిన చెత్తసేకరణ

ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేందుకు ఉపయోగించే క్లాప్(క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాలు నిలిచిపోయాయి. క్లాప్ వాహన సిబ్బందికి నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో క్లాప్ డ్రైవర్లు విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్నారు. ఫలితంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని నగరాలు, పట్టణాల్లో చెత్త సేకరణ నిలిచిపోయింది. అసలే డయేరియా భయంతో వణుకుతున్న ప్రజలకు చెత్తసేకరణ నిలిచిపోవడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది.

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 300కుపైగా క్లాప్ వాహనాలు
- నిర్వహణ, సిబ్బంది జీతాల బాధ్యత ప్రైవేటు ఏజెన్సీకి
- మూడు నెలలుగా జీతాలు చెల్లించని ఏజెన్సీ
- విధులు బహిష్కరించిన క్లాప్ వాహన డ్రైవర్లు
- వారం రోజులుగా ఇంటింటి చెత్త సేకరణ బంద్
- పేరుకుపోతున్న టన్నుల కొద్దీ చెత్త


వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో రోడ్డుపైన పేరుకుపోయిన చెత్త

(విజయవాడ - ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సీఎన్‌జీ వాహనాలను కేటాయించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు 225 వాహనాలు, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు 42 వాహనాలు, గుడివాడ మున్సిపాలిటీకి 31 వాహనాలు, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీకి 42 వాహనాలు కేటాయించారు. ఈ వాహనాల ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించేవారు. ఈ వాహన డ్రైవర్లకు జీతాల చెల్లింపు.. వాహనాల నిర్వహణ బాధ్యతను ఓ ప్రైవేటు ఏజెన్సీకి కట్టబెట్టారు. క్లాప్ డ్రైవర్‌కు రూ.18,500 చొప్పున ప్రభుత్వం ఈ ఏజెన్సీకి చెల్లిస్తుంది. అయితే ఏజెన్సీ వారు మాత్రం డ్రైవర్లకు రూ.12,000 మాత్రమే చెల్లిస్తున్నారు. మూడు నెలలుగా ప్రభుత్వం నుంచి తమకు బిల్లులు రాలేదంటూ ఏజెన్సీ వారు డ్రైవర్లకు జీతాల చెల్లింపును నిలిపివేశారు. 365 రోజులు పనిచేస్తున్నా జీతాల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ క్లాప్ డ్రైవర్లు విధులు బహిష్కరించి ఆందోళనబాట పట్టారు. దీంతో గత వారం రోజులుగా చెత్త సేకరణ నిలిచిపోయింది.

ఎక్కడ చూసినా చెత్తే..

విజయవాడ కార్పొరేషన్‌లో 225 వాహనాల నిర్వహణ, జీతాలకు ప్రతినెలా రూ.1.28 కోట్లు ఏజెన్సీకి చెల్లిస్తున్నారు. ఈ మొత్తాన్ని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) చెల్లిస్తుంది. గత కొంతకాలంగా విజయవాడ, మచిలీపట్నం కార్పొరేషన్‌తోపాటు గుడివాడ, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలోనూ చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో వాహన డ్రైవర్లు విధులు బహిష్కరించారు. విజయవాడ నగరంలో 225 వాహనాల ద్వారా ప్రతిరోజూ సుమారు 300 టన్నుల చెత్తను సేకరించి తరలిస్తారు. మచిలీపట్నంలో సుమారు 80 టన్నులు, గుడివాడ మున్సిపాలిటీలో 60 టన్నులు వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో 30 టన్నుల వరకు చెత్తను సేకరిస్తారు. వారం రోజులుగా క్లాప్ వాహనాల డ్రైవర్లు విధులు బహిష్కరించడంతో విజయవాడ నగరంలోనే సుమారు 500 టన్నులు, మిగిలిన పట్టణాల్లో సుమారు 200 టన్నుల వరకు చెత్త పేరుకుపోయింది.

మిగతా 6లో..



వైద్యశిబిరానికి వచ్చిన పేదలను ఆప్యాయంగా పలకరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఆరోగ్య భారత్ సాకారమవ్వాలి

- వైద్యసేవలు అందరికీ అందుబాటులో ఉండాలి: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఉంగుటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 'గ్రామీణప్రాంతాల్లో తక్కువ ధరకే మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తేవడంపై ప్రభుత్వాలతో పాటు ప్రైవేట్ వైద్యసంస్థలు, సేవా సంస్థలు దృష్టి సారించాలి. వైద్యఖర్చుల భరించలేమని పేదలు, మధ్యతరగతి ప్రజలు భయపడే పరిస్థితి రాకూడదు. పేదరికం, వివక్షతకు తావులేని ఆరోగ్య భారత్ సాకారం కావాలి.' అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్(విజయవాడ చాప్టర్)ప్రాంగణంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, అకిరా కంటి ఆస్పత్రి సౌజన్యంతో శనివారం ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్వర్ణభారత్‌ట్రస్ట్ స్థాపించిన నాటినుంచి ఇప్పటివరకు 48ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి 15వేలమందికి పైగా పేదలకు వైద్యసేవలందించిందని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లోనూ ట్రస్ట్ తరఫున సేవలు కొనసాగిస్తామన్నారు. శిబిరానికి విచ్చేసిన రోగులను ఆప్యాయంగా పలకరించారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి వెస్ట్ ప్రయాగ్‌రాజ్, ఎమ్మెల్యే సిద్ధార్థనాథ్‌సింగ్, స్వర్ణభారత్‌ట్రస్ట్ చైర్మన్ కామినేని శ్రీనివాస్, ట్రస్ట్ సీఈవో శరత్‌బాబు, ట్రస్ట్‌సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఒప్పందం

ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్(విజయవాడ చాప్టర్)లో ఫార్మా రంగంలో నైపుణ్యాభివృద్ధి, వ్యాక్సిన్, వైద్య ఉపకరణాల తయారీపై శిక్షణ త్వరలో అందుబాటులోకి రానుంది. శనివారం సువెన్ ఫార్మా, లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎల్ఎస్ఎస్ఎస్‌డీసీ), స్వర్ణభారత్‌ట్రస్ట్‌ల మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సమక్షంలో ట్రస్ట్ సీఈవో శరత్‌బాబు, ఈడీ పరదేశి, ఎల్ఎస్ఎస్ఎస్‌డీసీ సీఈవో గౌతమ్ భట్టాచార్య, సువేన్ ఫార్మాకంపెనీ కార్యదర్శి కుందన్‌కుమార్‌ఝాలు సంతకాలు చేశారు.



గుడివాడ ఆర్డీవో బాల సుబ్రహ్మణ్యంకు సమస్యలు వివరిస్తున్న వెదురుపావులూరు రైతులు

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఆర్వోఆర్ ప్రాజెక్టు పరిశీలనలో ఆర్డీవో, రైల్వే ఈఈ

గన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే అధికారులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారని తమ సమస్యలు పరిష్కరించే వరకూ పనులను నిలిపివేయాలని రైతులు అడ్డుకుని, ఆందోళన చేయడంతో వెదురుపావులూరు వద్ద నిర్మిస్తున్న రైల్ ఓవర్ రైల్(ఆర్‌వోఆర్) ప్రాజెక్టు ప్రాంతాన్ని గుడివాడ ఆర్డీవో బాల సుబ్రహ్మణ్యం శనివారం సందర్శించారు. రైల్వే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్‌కుమార్, రైతులతో కలసి ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఆర్వోఆర్ మ్యాప్‌ను పరిశీలించారు. రైతులు తమ అభ్యంతరాలను ఆర్డీవోకు వివరించారు. డ్రెయినేజీ, రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వివరించారు. డ్రెయినేజీ లేకపోతే నీళ్లు కిందకు వెళ్లవని, పంటలతో పాటు గ్రామం కూడా ముంపుబారిన పడే ప్రమాదం ఉందని వివరించారు. రైల్వే అధికారులు డ్రెయినేజీ వ్యవస్థను నిర్లక్ష్యంగా వదిలేశారని ఏనాడూ మెయింటెనెన్స్ చేయలేదని, ఒకవేళ రైతులు చేస్తుంటే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. భూసేకరణ సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని రైతు పాలడుగు సాంబశివరావు వివరించారు. కట్టిన కల్వర్టులో నీరు తక్కువ పోతోందని, రోడ్డు కల్వర్టులో వరి కోత యంత్రాలు రాకపోకలు సాగించలేవని వివరించారు. రైతులు ప్రస్తావించిన సమస్యలపై రైల్వే అధికారులతో ఆర్డీవో చర్చించారు. పది అడుగుల కల్వర్టు నిర్మిస్తామని, రైతుల పొలాల పక్కన 20 అడుగుల రోడ్డు నిర్మించేందుకు ఎన్వోసీ ఇస్తామని రైల్వే అధికారులు తెలిపారు. దక్షిణ పక్కన ప్రారంభం నుంచి చివరి వరకూ, తూర్పున రోడ్డు నిర్మాణం, సర్వీస్ రోడ్డు, కట్ట మధ్యలో పది అడుగుల రోడ్డు, బసవయ్య కుంట దగ్గర 20 అడుగుల వెడల్పు, 40అడుగుల పొడవుతో కల్వర్టు నిర్మిస్తామన్నారు. ఉత్తరం వైపు పది అడుగుల డ్రెయినేజీ నిర్మాణంపై రైతులు అభ్యంతరం తెలిపారు. ఇరిగేషన్ అధికారులకు ఆర్డీవో లేఖరాసి 20 ఏళ్ల నుంచి వచ్చే నీటి అంచనా మేరకు ఇక్కడ ఎన్ని అడుగులు డ్రెయినేజీ నిర్మించాలో రిపోర్టు చేస్తారని తెలిపారు. ఆ మేరకు ఉత్తరం వైపు డ్రెయినేజీ నిర్మిస్తామన్నారు. తహసీల్దారు శివయ్య, సర్వేయర్ మాధవరావు, రైతులు పాల్గొన్నారు.



ఉయ్యూరు రైతుబజార్‌లో సబ్సిడీ టమాటా స్టాల్‌ను పరిశీలిస్తున్న మార్కెటింగ్‌శాఖ కమిషనర్ విజయసునీత

సబ్సిడీపై వెయ్యి టన్నుల టమాటా

- రైతుబజార్ల ద్వారా ప్రజలకు అందించాం: వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ కమిషనర్ విజయసునీత

ఉయ్యూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెయ్యిటన్నుల టమాటాను సబ్సిడీపై రైతుబజార్ల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందజేసిందని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ కమిషనర్ ఎం.విజయసునీత తెలిపారు. ఉయ్యూరు రైతుబజార్‌లో సబ్సిడీ టమాటా స్టాల్‌ను శనివారం ఆమె పరిశీలించారు. భారీ వర్షాలు, వరదల వల్ల టమాట, ఉల్లిపాయల దిగుబడి గణనీయంగా తగ్గిందని, దీంతో ధరలు పెరిగాయని, వీటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆమె తెలిపారు. గతంలో కిలో రూ.75 పలికిన టమాటాను ప్రస్తుతం రూ.40కు తెచ్చామన్నారు. రానున్న కార్తీక మాసంలోనూ ధరలు పెరగకుండా చర్యలు తీసుకున్నామ న్నారు. ఉయ్యూరు రైతుబజార్ పల్లంగా ఉందని, వర్షం నీరుపోయే మార్గం లేక నీరు నిలిచి బురదకయ్యగా మారుతోందని విలేకరులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. చుట్టూ ప్రహరీ నిర్మాణం, మెరక పనులు చేసి నీరు నిల్వకుండా చూస్తామని విజయసునీత తెలిపారు. మార్కెటింగ్‌శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి నిత్యానందం, రైతుబజార్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- గుర్రపు డెక్క, ఇంగ్లీషు గడ్డితో పూడిక
- కాలువలో కలుస్తున్న మురుగునీరు
- ఆక్రమణలతో బోదెలా మారిన వైనం
- అధికారులు పట్టించుకోవటం లేదంటున్న రైతులు

పేరుకే.. పంట కాలువ!

వర్షాకాలంలోనూ సాగుకు నీరందక వలివర్తిపాడు రైతుల అవస్థలు



వలివర్తిపాడు-మల్లాయిపాలెం మధ్య గుర్రపు డెక్కతో పూడుకుపోయిన పంటకాలువ

వందలాది ఎకరాలకు సాగు నీరందించే వలివర్తిపాడు పంట కాలువ పూడుకుపోయింది. గృహాలు, ఫ్యాక్టరీల నుంచి వదిలే మురికి నీటితో కలుషితమైపోయింది. పూడిక, వ్యర్థాల పారబోత కారణంగా వర్షాకాలంలోనూ సాగునీరందక కాలువ కింద పొలాలు సాగుచేస్తున్న రైతాంగం సతమతమైపోతోంది. సాగు అవసరాలకే కాకుండా, తాగునీటి కోసమూ వినియోగించే ఈ కాలువలో మురుగు నీటి కారణంగా గ్రామ ప్రజానీకం ఇబ్బంది పడుతోంది. పూడిక తొలగించాలని అధికారులను కోరుతోంది.

(ఆంధ్రజ్యోతి-గుడివాడ రూరల్)

గుడివాడ పక్క నుంచి మల్లాయిపాలెం, వలివర్తిపాడు, మెరకగూడేనికి వెళ్లే వలివర్తిపాడు పంట కాలువ గుర్రపు డెక్క, తూడు, ఇంగ్లీష్ గడ్డితో పూడుకుపోయింది. గుడివాడ మునిసిపాలిటీ, గ్రామాలు, ఫ్యాక్టరీల నుంచి వచ్చే మురుగు వదలడంతో పంట కాలువలోకి మురుగునీరు చేరుతోంది. కాలువలో వ్యర్థాలు పారబోయడం, పూడిక కారణంగా వర్షాకాలంలోనూ నీరు పారక సాగుకు పెట్టుకోలేని దుస్థితి రైతులకు దాపురించింది. సమస్య పరిష్కరించాలని ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని ఆయకట్టు రైతాంగం వాపోతోంది.

రెండు వైపులా ఆక్రమణలు

కాలువ గట్లను రెండు వైపులా ఆక్రమించేశారని, పెద్ద కాలువ చిన్న పంట బోదెలా మారిపోయిందని రైతులు చెబుతున్నారు. నీటి పారుదల లేక వందలాది ఎకరాలకు నీరందక ఇబ్బంది పడుతున్నామని, అధికారులు కాలువలో తూడు, గుర్రపుడెక్క, ఆక్రమణలు తొలగించాలని వారు కోరుతున్నారు.

దోమలు విజృంభిస్తున్నాయి



పంట కాలువలో గుర్రపు డెక్క పేరుకుపోవటంతో దోమలు విజృంభిస్తున్నాయి. కనీసం ఇళ్ల దగ్గర ఉండలేని పరిస్థితి ఉంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదు.

- తోకల వెంకన్న, వలివర్తిపాడు

తాగునీటికీ ఇబ్బందులే..



గ్రామంలో తాగునీటి అవసరాలకు ఈ కాలువను ఉపయోగిస్తాం. మురుగు నీరు రావడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. గుర్రపుడెక్క, ఇంగ్లీష్ గడ్డి తొలగించాలి. మురుగునీరు రాకుండా చూడాలి.

- గుడివాడ దేవపాలన, వలివర్తిపాడు



వలివర్తిపాడు వద్ద కాలువలో మురుగునీరు, ఇంగ్లీష్ గడ్డి

అంచనాలు రూపొందించాం..త్వరలో పనులు

పంటకాలువ పూడికతీత పనులకు అంచనాలు రూపొందించాం. త్వరలో కాలువ మరమ్మతులు చేయిస్తాం. తాత్కాలికంగా కొంత భాగం చేయించాం. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

- పవన్, ఇరిగేషన్ ఏఈ

మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు చిత్తు

- పాఠశాలలకూ మహమ్మారి విస్తరించడం బాధాకరం
- పిల్లల ప్రవర్తన తల్లిదండ్రులు గమనించాలి
- 'నూతన తరహా న్యాయ సేవల శిబిరం'లో జిల్లా న్యాయాధికారి అరుణసారిక

కూచిపూడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 'మద్యం, మాదకద్రవ్యాల బారిన పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పాఠశాలలకూ ఈ మహమ్మారి విస్తరించడం బాధాకరం. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మాట్లాడాలి. వారి అలవాట్లు తెలుసుకోవాలి. వారి ప్రవర్తనను గమనించాలి. వారు మార్గంలో నడిచేలా చూడాలి.' అని న్యాయసేవాధికార సంస్థ జిల్లా చైర్‌పర్సన్, జిల్లా న్యాయాధికారి అరుణసారిక పేర్కొన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ, ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, కృష్ణాజిల్లా పరిపాలనా యంత్రాంగం సంయుక్తంగా మొవ్వ క్షేత్రయ్య కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన 'నూతన తరహా న్యాయ సేవల శిబిరం'లో ఆమె మాట్లాడారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మాదక ద్రవ్యాలపై 600 నుంచి 700 కేసులు నమోదయ్యాయని ఆమె తెలిపారు. మాదకద్రవ్యాల కేసులు అధికమయ్యాయని, సమాజంలో మార్పు గ్రామాల నుంచే మొదలు కావాలని మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి చిన్నంశెట్టి రాజు సూచించారు. లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కారమైన కేసులకు అప్పీల్ ఉండదని, శాశ్వత పరిష్కారం పొందవచ్చని, వీటిని సద్వినియోగపర్చుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. 'మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, మహిళలకు రక్షణకు కొత్త చట్టాలు'పై ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు అవగాహన కల్పించారు. వివిధ సంక్షేమ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను న్యాయాధికారులు, అధికారులు పరిశీలించారు. వైద్యఆరోగ్యశాఖ వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. గర్భవతులకు సామూహిక సీమంతాల్లో కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొన్నారు. న్యాయసేవా శిబిరంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య, మొవ్వ మండల న్యాయసేవాధికార చైర్మన్ పి.రాజన్‌ఉదయ్‌ప్రకాష్, అదనపు డీఎం హెచ్‌వో డాక్టర్ ఎ.వెంకట్రావు, గిరిజన సంక్షేమ జిల్లా అధికారి ఫణిదు ర్గటి, చెన్నుపాటి కీర్తి, చైల్డ్‌ప్రొటెక్షన్ జిల్లా అధికారి మౌనీషా, ఉయ్యూరు ఆర్డీవో షారోన్, ఎండీవో విమాదేవి, తహసీల్దార్ మస్తాన్ పాల్గొన్నారు.



మొవ్వ న్యాయ సేవా శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి అరుణసారిక



సామూహిక సీమంతాల్లో పాల్గొన్న కలెక్టర్ డీకే బాలాజీ

మాతృ, శిశు మరణాల రేటు తగ్గేలా చూడండి

- అధికారులతో సమీక్షలో కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 'కృష్ణాజిల్లాలో మాతృ, శిశుమరణాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరిగేలా చూడాలి.' అని వైద్యశాఖ అధికారులకు కలెక్టర్ బాలాజీ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో వైద్యశాఖ అధికారులతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మాతృమరణాలు తగ్గించేందుకు గర్భవతులను 12 వారాల్లోపే గుర్తించాలని కలెక్టర్ సూచించారు. ఇంటింటి సర్వే నిర్వహించి గర్భవతులకు వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ఏఎన్ఎంలు గర్భవతుల పేర్లను నమోదుచేసి వారికి వైద్యపరీక్షలు నిర్వహించాలని, రక్తహీనతకు చికిత్స చేయించాలని, ధనుర్వాతం ఇంజెక్షన్లు చేయించాలని సూచించారు. ఆరోగ్యం ప్రమాదకరస్థితిలో ఉన్నవారిని గుర్తించి కాన్పు అయ్యేవరకు వైద్యసిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు. బాలింతల గృహాల్ని సందర్శించి తల్లీ, బిడ్డల ఆరోగ్యపరిస్థితులను తెలుసుకోవాలన్నారు. శిశువులకు సకాలంలో టీకాలు వేయించేలా తల్లులకు కనీస అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి, డాక్టర్ శ్రావణ్‌కుమార్, డీసీహెచ్ఎస్ ఎం.శ్రీనివాస్, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, పలువిభాగాల వైద్యులు పీహెచ్‌సీలలో పనిచేసే వైద్యులు, సిబ్బంది ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తీర గ్రామాల్లో ఇసుక పండుగ

(ఐదో పేజీ తరువాయి)

కోసం సామాన్యులు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కొన్ని అడుగుల దూరంలోనే ఇసుక ఉన్నప్పటికీ సవాలక్ష ఆంక్షలతో ఇసుక అందని ద్రాక్షగా తయారైంది. రూ.వేలకు వేలు చెల్లించేందుకు సిద్ధపడినప్పటికీ ఇసుక దొరకటం గగనమైంది. నిర్మాణ రంగం కుంటుపడటంతో కూలీలకు ఉపాధి దొరకని దుస్థితి నెలకొంది. పసిడిగా తయారైన ఇసుక దోపిడీపై శ్రద్ధ పెట్టిన వైసీపీ పాలకులు నిబంధనలు ఉల్లఘించి నదుల గర్భాలను యంత్రాలతో కొల్లగొటి సరిహద్దులు దాటించి అమ్ముకున్నారు. దీంతో స్థానికంగా ఇసుక అందుబాటులో లేకుండా పోయింది.

పేదల కష్టాలను చూసే ఉచిత ఇసుక విధానం

అయితే పేదలు, కూలీల కష్టాలను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ఏర్పడగానే సీఎం చంద్రబాబు గతంలో మాదిరిగా ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టారు. ముందుగా స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను విక్రయించారు. రవాణా ఖర్చులు, సీనరేజీ, జీఎస్టీ, ఇతరత్రా పన్నులు కలిపి టన్ను రూ.290 ధర నిర్ణయించారు. స్టాక్ పాయింట్ల వద్ద నేతలు, అధికారులు కుమ్మక్కు కావడంతో ధర అందుబాటులో లేకుండా పోయింది. ఇసుక దొరకని పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్ బుకింగ్ ప్రవేశపెట్టినప్పటికీ వెసులుబాటు కలగలేదు. లారీకి కేవలం 20 టన్నులు మాత్రమే లోడింగ్ చేయటం వల్ల ఒకవైపు లారీ యజమానికి గిట్టుబాటు కాలేదు, మరోవైపు విజయవాడ, ఏలూరు ఇతర పట్టణాల్లో వినియోగదారులు అధిక ధర చెల్లించాల్సి వచ్చింది. మరోవైపు నేతల ఒత్తిళ్లతో ట్రాక్టర్లపై అధికారులు కొరడా ఝులిపించటం ప్రారంభించారు. వాల్టా కేసులు నమోదు చేశారు. ఉచిత ఇసుక విధానం వల్ల కూటమి ప్రభుత్వానికి తగినంత మైలేజీ రాకపోగా, ఎక్కడికక్కడ స్థానిక నేతల పెత్తనం వల్ల చెడ్డపేరు వచ్చే పరిస్థితి తలెత్తింది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను వివిధ మార్గాల ద్వారా తెలుసుకున్న సీఎం చంద్రబాబు ఇసుక విషయంలో సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. రీచ్‌ల నుంచి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుక తీసుకువెళ్లవచ్చునని, ఈ విషయంలో అధికారులెవ్వరూ అడ్డగించవద్దని ఆదేశించారు. ఇసుక ట్రాక్టర్లపై కేసులు పెట్టిన అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఒకవేళ పార్టీ నేతలు అడ్డగించినా, ఉచిత విధానానికి తూట్లు పొడిచినా మొహమాటం లేకుండ కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం వల్ల అన్ని వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఆంక్షలు తొలగించటం వల్ల ఇక ఇసుక కష్టాలు పూర్తిగా తొలగిపోతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇక తక్కువ ధరకు ఇసుక లభ్యం

తీరగ్రామాలతో పాటు సమీప గ్రామాలు, పట్టణాల్లో ఇసుక తక్కువ ధరకు లభించనుంది. నిన్నటి వరకు నందిగామ, కంచికచర్లలో ట్రాక్టర్ ఇసుక రూ. 3 వేల నుంచి రూ. 3,500 పలికింది. ఒకవైపు ట్రాక్ట ర్లకు ఉచితం చేయటం, మరోవైపు సీనరేజ్, జీఎస్టీ కూడా తీసివేయటం వల్ల నిర్భయంగా ఇసుక తోలుకోవటానికి వీలు పడింది. ఇక నుంచి ట్రాక్టర్ ఇసుక వెయ్యి రూపాయలకు లభించనుంది. లారీలకు లోడిం గ్‌పై ఇంతకు ముందున్న పరిమితిని తొలగించారు. 20 టన్నుల నుంచి 30 టన్నుల వరకు లోడింగ్‌కు అనుమతి ఇస్తూనే ఓవర్ లోడ్ పెనాల్టీ విధించవద్దని సీఎం అధికారులను ఆదేశించటం వల్ల పట్టణాల్లో సైతం ఇసుక ధర భారీగా తగ్గనుంది.

కొందరు నేతల్లో అసహనం

సీఎం తీసుకున్న నిర్ణయంతో కొందరునేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గాల్లో చక్రంతిప్పే నేతలు ఇసుక రాబడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రీచ్‌లను, స్టాక్ పాయింట్లను గుప్పిట్లో పెట్టుకుని అడ్డగోలుగా దోపిడీ చేసేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. దీనిలో భాగంగానే రీచ్‌లలో తవ్వకాలు, రవాణా, లోడింగ్‌కు తక్కువ ధరలకు టెండర్లు వేయించారు. ట్రాక్టర్లకు ఉచితం చేయటంతో రాబడిపై ఆశలు పెట్టుకున్న నేతలు అసంతృప్తితో రగిలిపోతున్నారు.

జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్

కుర్చీ కోసం పోటాపోటీ

- టీడీపీ నేతల ముమ్మర ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి-జగ్గయ్యపేట)

జగ్గయ్యపేట ఏఎంసీ చైర్మన్ పదవి కోసం టీడీపీలో తీవ్ర పోటీ ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నియోజకవర్గస్థాయిలో నెంబరు-2 పదవి కావడంతో సీనియర్లు పోటీపడుతున్నారు. గతంలో జగ్గయ్యపేట ఏఎంసీ పరిధిలో జగ్గయ్యపేట, వత్సవాయి మండలాలు ఉండేవి. పెనుగంచిప్రోలు, నందిగామ మండలాల్లోని నియోజకవర్గపరిధి గ్రామాలు నందిగామ ఏఎంసీ పరిధిలో ఉండేది. గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గం మొత్తాన్ని ఏఎంసీ పరిధిలోకి తెచ్చింది. దీంతో ఈ పదవికి ప్రాధాన్యం ఏర్పడింది. జగ్గయ్యపేట మండలం నుంచి సీనియర్ నేత, పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్న తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు సత్యనారాయణప్రసాద్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తెలుగు యువత మండల అధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా, తెలుగురైతు రాష్ట్ర అధికారప్రతి నిధిగా ఆయన పనిచేశారు. నియోజకవర్గ ముఖ్యనేతలతో పాటు, రాష్ట్రస్థాయి పరిచయాలు ఆయనకు కలిసి వస్తాయని భావిస్తున్నారు. టీడీపీ వత్సవాయి మండలాధ్యక్షుడు, వత్సవాయి మాజీ సర్పంచ్ వడ్లమూడి రాంబాబు పేరు కూడా వినిపిస్తోంది. టీడీపీ పెనుగంచిప్రోలు మండల అధ్యక్షుడు చింతల సీతారామయ్య కూడా రేసులో ఉన్నారని తెలుస్తోంది. పెనుగంచిప్రోలు మండలానికి రెండు దశాబ్దాలకు పైగా అధ్యక్షుడిగా ఉన్న తనకు పదవి ఇవ్వాలని, తమ మండలానికి ఈసారి అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నట్టు సమాచారం.

గేదెలు మేపుతుండగా పిడుగుపడి..కాపరి మృతి

పెనుగంచిప్రోలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు ఓ పశువుల కాపరి పొలంలోనే దుర్మరణం చెందాడు. ఈ ఘటన శనగపాడులో శనివారం మధ్యాహ్నం జరిగింది. మండలంలో కొద్దిసేపు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఆ సమయంలో పొలంలో గేదెలు మేపుతున్న ధారావత్ బాలాజీ(51)పై పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నీటి విడుదలపై ఆశలు

(ఐదో పేజీ తరువాయి)

ఎంతమేర నీటిని కాలువలకు విడుదల చేయాలి, సాగునీటి ప్రాజెక్టులలో నీటి లభ్యత తదితరాలను బేరీజు వేసుకుని అధికారులు, పాలకులు తగు నిర్ణయం తీసుకుంటారు. ఈ సమావేశం నవంబరు ప్రారంభంలోనే నిర్వహిస్తే రైతులకు ఉపయోగం ఉంటుందని రైతులు అంటున్నారు. త్వరలోనే ఈ సమావేశం జరిగే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు సూచనప్రాయంగా చెబుతున్నారు. రబీ సాగుకు అదను దాటిన తరువాత సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటే ఉపయోగం ఉండదని తీరప్రాంత రైతులు పేర్కొంటున్నారు. రబీ సీజన్‌కు సాగునీటిని విడుదల చేసే అంశంపై ప్రకటన చేస్తే అందుకు అనుగుణంగా వరిసాగు చేయాలా, ఆరుతడి పంటలను వేయాలా అనే అంశంపై తగు నిర్ణయం తీసుకుంటామని రైతులు అంటున్నారు.

రబీలో 1.20 లక్షల హెక్టార్లలో మినుము, మొక్కజొన్న, పెసర సాగు

జిల్లాలో రబీ సీజన్‌లో ఏటా 1.20 లక్షల హెక్టార్లలో మినుము, మొక్కజొన్న, పెసర పంటలు రైతులు సాగుచేస్తారు. సముద్రతీరంలోని కోడూరు, నాగాయలంక, మచిలీపట్నం, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు, పామర్రు మండలాల్లో రబీ సీజన్‌లో సుమారు 50 వేల హెక్టార్లలో వరి సాగు చేస్తారు. సాగునీటి విడుదలను బట్టి వరి సాగు చేసే విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉంటుంది. గన్నవరం, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో కాలువలకు సాగు నీటిని విడుదల చేయకున్నా బోరు నీటి ఆధారంగా రబీలో వరి సాగుచేస్తారు. నీటిని విడుదల చేస్తే ఆ నీటిని పంటలకు ఉపయోగించుకుంటారు. రబీలో వరిసాగుకు అనుమతులు ఇస్తే అందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ అధికారులు ముందస్తుగానే ప్రణాళికను తయారు చేసుకోవాల్సి ఉంది.

క్లాప్ బంద్!

(ఐదో పేజీ తరువాయి)

అసలే డయేరియా.. ఆపై చెత్త సమస్య

కొన్ని రోజుల క్రితం వరకు ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని పలు ప్రాంతాల్లో డయేరియా ప్రజలను అల్లాడించింది. ఇప్పటికీ కేసులు నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చెత్త సేకరణ నిలిచిపోవడం.. ఇళ్లలో చెత్త పేరుకుపోవడంతో పాటు వీధుల్లో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. తక్షణం సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వీఎంసీలో 110 ట్రాక్టర్లు ఏర్పాటు

విజయవాడలో క్లాప్ డ్రైవర్ల ఆందోళన నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా పేరుకుపోయిన చెత్తను తరలించేందుకు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం 110 ట్రాక్టర్లను ఏర్పాటు చేసినట్లు వీఎంసీ అధికారులు తెలిపారు. వీఎంసీ టిప్పర్లు, ట్రాక్టర్లతో నగరంలో చెత్త సమస్య తలెత్తకుండా చూస్తున్నట్లు చెప్పారు. మచిలీపట్నం కార్పొరేషన్‌తోపాటు తాడిగడప, గుడివాడ మున్సిపాలిటీల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

ప్రత్యేక డీఈడీ కళాశాల రికార్డుల పరిశీలన

గన్నవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మర్లపాలెం రోడ్డులోని ప్రత్యేక డీఈడీ కళాశాలలో శనివారం గుడివాడ డీవైఈవో పద్మరాణి ఆధ్వర్యంలో రికార్డులు పరిశీలించారు. డీఈవో తాహేరా సుల్తానా ఆదేశాల మేరకు కళాశాల అనుమతి పత్రాలను, విద్యార్థుల హాజరును, కళాశాల రికార్డులను పరిశీలించారు. కళాశాల యాజమాన్యంతో పాటు ప్రత్యేక డీఈడీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల అనుమతుల విషయమై డీఈవోకు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపినట్లు తెలిపారు. నివేదికను డీఈవోకు అందజేస్తామని గుడివాడ డీవైఈవో పద్మరాణి తెలిపారు. కమిటీ సభ్యులు ఐసీడీఎస్ సీడీపీవో పి.వెంకటలక్ష్మి, పద్మవాణి తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- మడిచర్ల, బిళ్లనపల్లి, కొత్తపల్లి, మల్లవల్లి, రంగన్నగూడెం, సింగన్నగూడెం, రేమల్లె, వేలేరు ఎస్.ఎన్.పాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హనుమాన్‌జంక్షన్‌రూరల్ / ఉంగుటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలకు మహర్దశ కలుగుతుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. వేలేరు, మడిచర్ల, బిళ్లనపల్లి, కొత్తపల్లి, మల్లవల్లి, రంగన్నగూడెం, సింగన్నగూడెం, రేమల్లె, ఎస్.ఎన్.పాలెం పరిధిలో రూ. 4కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం ఆయన భూమిపూజ నిర్వహించారు. వేలేరు ముఖద్వారం వద్ద గల కోదండరామాలయం, వినాయక స్వామి దేవాలయాల్లో మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బడికి వెళ్లే రహదారిని అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు వేలేరు హైస్కూల్ విద్యార్థులు పూలజల్లులతో అపూర్వ సాగత్వం పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, వ్రాణం హరిబాబునాయుడు, వేములపల్లి శ్రీనివాసరావు, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయికళ్యాణి, పుట్టా సురేష్, తదితరులతో పాటు ఆయా గ్రామాల టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం..

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి వుందని, గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకోక పూర్తిగా కుంటుపడిన గ్రామీణ వ్యవస్థను పుంజుకునేలా చేసి, పంచాయతీల రూపురేఖలను మార్చేందుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు కంకణబద్ధులై ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని తేలప్రోలులో సుమారు రూ. 40లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణపనులకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ అసమర్థపాలన, పాలకుల అస్తవ్యస్త విధానాలతో రాష్ట్రాన్ని అణగారిన ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామఅధ్యక్ష, కార్యదర్శులు భీమవరపు వెంకటరెడ్డి, అలుగోజి నాగబాబు, మండల పార్టీ అధ్యక్షులు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, నాయకులు దుడ్ల కుమార్, గుడ్డేటి శ్యామ్, గులిపల్లి సందీప్, వంగా అయ్యప్పరెడ్డి, రాజబోయిన శివాజీ, నిమ్మకూరి మహేష్, మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, విజయారెడ్డి, కొండేటి వెంకటేశ్వరరావు, ఈసరి రవికుమార్, పోతినేని రామకృష్ణ, చల్లగుల్ల షణ్ముఖ్, సర్పంచ్ లాం దిబోర, ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఎంపీడీవో ఈ.సత్య కుమార్, పీఆర్ ఏఈ జి.శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వేలేరులో అభివృద్ధి పనుల భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, హరిబాబునాయుడు, తదితరులు



తేలప్రోలులో సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి

పలుగ్రామాల్లో పల్లెపండుగ వారోత్సవాలు..

మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి నేతృత్వంలో శనివారం ఆ పార్టీ గ్రామ కమిటీ నాయకులు, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులు పల్లెపండుగ -పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. వెన్నూతలలో 9.80లక్షల వ్యయంతో సీసీరోడ్డు, నాగవరప్పాడులో 11.80 లక్షల వ్యయంతో సీసీరోడ్డు, వెల్దిపాడులో 9.10లక్షలతో సీసీరోడ్డు, మధిరపాడులో 7.50లక్షల వ్యయంతో ఎంపీపీ పాఠశాల కాంపౌండ్‌వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఎంపీడీవో ఈ.సత్యకుమార్, ఈవోపీ ఆర్డీ వి.దిలీప్‌కుమార్, కూటమినేతలు పాల్గొన్నారు.



శిరీషా దివ్యాంగ బాలల పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉయ్యూరు న్యాయాధికారి కె. శ్రీహరి

రిహేబిలిటేషన్ సెంటర్ పరిశీలన

ఉయ్యూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : శిరీషా దివ్యాంగ బాలల పునరావాస కేంద్రాన్ని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ఉయ్యూరు న్యాయాధికారి కె.శ్రీహరి శనివారం పరిశీలించారు. పునరావాస కేంద్రంలో బాలలకు అందిస్తున్న సేవలు, ఆహారం తదితర అంశాలపై నిర్వాహకులను ఆరా తీశారు. వంటగది పరిశీలించి ఆహారం రుచి చూశారు. బాలల ఆరోగ్యం, రక్షణ విషయాలను అడిగి తెలుసుకుని, బాలలతో ముచ్చటించారు. ఉయ్యూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపిచంద్, ప్రధాన కార్య దర్శి గుండు శ్రీకృష్ణకుమార్, సీనియర్ న్యాయవాది జి.లక్ష్మీనారాయణ, కె. గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలకు ఆధార్‌కార్డు నమోదుకు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను మండలంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటలు వరకు ఈ శిబిరాలను నిర్వహిస్తారని తెలిపారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

కంకిపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నవయుగ సేవా సంస్థ అధ్యక్షులు యార్లగడ్డ బుల్లియ్య అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థికసాయాన్ని శనివారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఉయ్యూరు శివరావు ఎస్‌ఎంసీ చైర్మన్ నాగమణి, హెచ్‌ఎం అరుణ కుమారి, స్టాఫ్ సెక్రటరీ పి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న బుల్లియ్య



సదస్సులో మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.కేశవరావు

రైతులు, కౌలురైతులను ఆదుకోవాలి

ఉంగుటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : వరదలకు పాడైపోయి న విద్యుత్‌మోటార్లు, ఆయిల్ ఇంజన్ల మరమ్మతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి రైతులు, కౌలురైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.కేశవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద ముంపునకు పాడైపోయిన మోటార్లు, ఆయిల్ ఇంజన్లకు పరిహారం ఇవ్వాలని, కోరుతూ శనివారం ఉంగుటూరులోని మానికొండ సూర్యావతి శ్రామిక భవనంలో రైతు సంఘం, కౌలురైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కౌలురైతుల సంఘం జిల్లాకార్యదర్శి పి.రంగారావు, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు, కౌలురైతులసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ లక్ష్మణస్వామి, సీఐటీయు మండల ప్రధాన కార్యదర్శి కడవకొల్లు రామరాజు, కౌలురైతుల సంఘం నాయకులు, టీవీ రామ్మోహనరావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : రీసర్వేలో తలెత్తిన భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతున్నదని తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. బొమ్ములూరు, కొయ్యూరు గ్రామాల్లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం గ్రామసభలు నిర్వహించారు. సర్వే విస్తరణలో హెచ్చుతగ్గులున్నాయని, సర్వే నెంబర్లు మారిపోయాయని రైతులు ఫిర్యాదు చేశారు. కొయ్యూరులో 10మంది రైతులు, బొమ్ములూరులో 8మంది రైతులు రీసర్వే తప్పులు జరిగాయని ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్వేయర్ వినోద్, వీఆర్‌వో తేరేజమ్మ, సర్పంచ్ కొల్లి వీర వెంకట సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా జట్ల ఎంపిక

ఉయ్యూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజక వర్గస్థాయి అండర్- 14, అండర్- 17 బాలబాలికల కబడ్డీ, ఖోఖో, యోగసనాల క్రీడా జట్ల ఎంపిక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరు మండలాల నుంచి 260 మంది బాల బాలికలు ఈ పోటీలలో పాల్గొనగా ఎంపికైనవారు ఈ నెలలో జరిగే జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్టు నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జీవీ రమణ తెలిపారు.



సాయిపురంలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఉయ్యూరు/ కంకిపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పల్లెపండుగ కార్యక్ర మంతో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ ఏర్పడుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా కడవకొల్లులో రూ.32 లక్షలు, కాటూరులో రూ. 56 లక్షలు, కలవపాములలో రూ. 17 లక్షలు, ముదునూరులో రూ. 28 లక్షలు, బోళ్లపాడులో రూ. 42 లక్షలు, సాయిపురంలో రూ. 10లక్షలు ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు, సాయిపురం సర్పంచ్ షేక్ జాన్‌బాషా, ఎంపీటీసీ సభ్యురాలు తుమ్మూరు గంగారత్నం పాల్గొన్నారు.

మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమని కంకి పాడు మండల పరిషత్ అధ్యక్షురాలు నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరులో రూ. 1.02 కోట్లు, కోల వెన్నులో రూ.80 లక్షలు, జగన్నాథపురంలో రూ. 65 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆమె శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనూష, పీఆర్ ఏఈ రాఘవరావు, ప్రొద్దుటూరు సర్పంచ్ పామర్తి శివ నాగలక్ష్మి, పావనమూర్తి, కోటేశ్వరరావు, పలగాని శివశంకర్, యార్లగడ్డ ఫణి, దోబా నాంచారయ్య, వెంకయ్య, కోలవెన్నులో సర్పంచ్ సురేష్, తుమ్మల జగదీష్, బొబ్బా శ్రీను, లాం ప్రతాప్, ఆదినారాయణ, జనసేన పార్టీ నాయకులు అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.


యువతకు ప్రభుత్వంపై నమ్మకం

- తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి

ఉయ్యూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉపాధి కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నూతనంగా తీసుకువచ్చిన ఆరు పారిశ్రామిక పాలసీలతో కూటమి ప్రభుత్వంపై యువతకు నమ్మకం కలిగిందని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను శనివారం విజయవాడలో కలిసి యువతకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తూ ఘనంగా సత్కరించారు. జిల్లాలో మర్ని పరిశ్రమలు వచ్చేందుకు మీవంతు కృషి చేసి జిల్లా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని కోరినట్లు దండమూడి తెలిపారు.



మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న దండమూడి చౌదరి



22 23న కృష్ణా తీరంలో.. డ్రోన్ షో

పున్నమి ఘాట్‌లో 5వేల డ్రోన్లతో ఇల్యూమినేటెడ్ షో

కళ్లు మిరుమిట్లు గొలిపే డ్రోన్ షోకు బెజవాడ వేదిక వుతోంది. ఐదేళ్ల తర్వాత నగరంలో మళ్లీ నగరవాసులకు మంచి వినోదాన్ని పంచే ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్ జరగబోతోంది. ఈనెల 22న పున్నమిఘాట్ వేదికగా జరిగే ఈ డ్రోన్ షోకు అందరూ ఆహ్వానితులే. కృష్ణమ్మ చెంతన భారీగా నిర్వహించే ఈ డ్రోన్ షో గతంలో జరిగిన ఈవెంట్ల కంటే కూడా సమ్‌థింగ్ స్పెషల్‌గానే ఉంటుంది.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

- ఆకాశంలో వెలుగు జిలుగుల చిత్రాల ఆవిష్కరణ
- భారీగా సాంస్కృతిక ప్రదర్శనలు, వీ అన్‌బీటబుల్ డ్యాన్స్ షో
- కృష్ణా తీరంలో ముందే దీపావళి గ్రాండ్ ఫైర్ వర్క్స్ (బాణసంచా)
- చల్లని రాత్రిసమయంలో మ్యూజిక్ బ్యాండ్

ఒకటా రెండా 5 వేల డ్రోన్లు ఆకాశంలో చేసే విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. ఇల్యూమినిటేడ్ వెలుగు జిలుగులతో ఆకాశంలో చాయాచిత్రాలను ఆవిష్కరిస్తుంది. ఆకాశంలో ఈ డ్రోన్లు చేసే గ్రాఫిక్స్ కట్టిపడేస్తాయి. అంతర్జాతీయ టాప్ షోల్లో డ్రోన్ షోదే అగ్రస్థానం. ప్రపంచంలోనే అతి పెద్ద డ్రోన్‌షోల్లో విజయవాడ ఈవెంట్ కూడా ఒకటి. కృష్ణానదిపై ఆకాశంలో ఈ డ్రోన్లు చేసే విన్యాసాలు వీక్షకులను మరో లోకంలోకి తీసుకు వెళ్లనున్నాయి. రాష్ట్రాన్ని డ్రోన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఈ నెల 22, 23న మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో డ్రోన్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ డ్రోన్ షోను కృష్ణాతీరంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడే ఎందుకు నిర్వహిస్తున్నారంటే 5 వేల డ్రోన్లు చేసే విన్యాసాలను అశేష జనవాహిని వీక్షించటానికి అనుకూలంగా ఉంటుంది కాబట్టి. దీంతో పాటు మరో ప్రత్యేక కారణం పర్యాటకానికి ఊతం ఇవ్వటానికి కూడా నిర్వహిస్తున్నారు. ఆకాశంలో డ్రోన్ల విన్యాసాలు కృష్ణానదిపై ప్రతిబింబిస్తూ ఈ ప్రాంతాన్ని వర్ణరంజితం చేస్తుంది. ఈ దృశ్యాలను చూడటానికి రెండు కళ్లు చాలవు. ఈ షో దాదాపుగా గంట పాటు సాగుతోంది.

మరెన్నో మస్త్.. అట్రాక్షన్స్

డ్రోన్ షో వీక్షించటానికి వచ్చేవారి కోసం ఇంకా ఎన్నో ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలకు రంగం సిద్ధం చేశారు. చల్లటి సాయంత్రం 6.30 గంటల నుంచి 8 గంటల పాటు ఏకబిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. వీ అన్‌బీటబుల్ డ్యాన్స్‌లు, ముంబాయి కళాకారులు అబ్బుర పరిచే ప్రదర్శనలు, లేజర్ బీమ్ షోతో కృష్ణా తీరం ధగధగలాడనుంది. ఈ లేజర్ షోతో వీక్షకులు ఫుల్ ఫిదా అవుతారు. వీటి మ్యూజిక్ బ్యాండ్ ఉంటుంది. బ్యాండ్ సంగీతంలో ఓలలాడిన తర్వాత అంతిమంగా గ్రాండ్ ఫైర్ వర్క్స్ జరుగుతుంది. దీంతో కృష్ణానది తీరాన దీపావళిని ముందే ఆవిష్కృతం చేయనున్నారు. అనంతరం బాణసంచా వెలుగు జిలుగులతో మనసు నింపుకుని హాయిగా ఇంటికి వెళ్లటమే!

డ్రోన్ షోకు పటిష్ఠ ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా, సీపీ రాజశేఖర్‌బాబు



విద్యాధరపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22, 23న పున్నమీఘాట్ బబ్బూరి గ్రౌండ్స్‌లో జరగనున్న డ్రోన్ షోకు అధికారులు సమన్వయంతో వ్యవహరించి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అన్నారు. శనివారం క్షేత్రస్థాయిలో పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, ఇతర అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల హాజరు కానున్న దృష్ట్యా అందుకనుగుణంగా గ్యాలరీలను ఏర్పాటు చేయాలని మౌలిక వసతుల్లో లోటుపాట్లు ఉండకూడదన్నారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ అన్ని విధాల పటిష్ఠ ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీఎంసీ కమిషనర్ ఎస్.ఎం. ధ్యానచంద్ర, అసిస్టెంట్ కలెక్టర్ శుభంనోక్వాల్, డీఆర్వో శ్రీనివాసరావు, డీసీపీ ఉదయరాణి, బీఆర్‌డీఎఫ్ పీడీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలుత నిధిమీనా, పోలీస్ కమిషనర్ డ్రోన్ సమ్మిట్‌పై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ సీఎం మార్గదర్శకాలకు అనుగుణంతో డ్రోన్ షో, డ్రోన్ సమ్మిట్‌ను విజయవంతానికి సమష్టి కృషి అవసరమన్నారు.

డ్రోన్ షోలో ఆహ్లాదకరమైన వాతావరణం

- వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



వన్‌టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి: పున్నమిఘాట్‌లో జరగనున్న డ్రోన్ షోకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి. ప్రసాద్, చీఫ్ ఇంజనీర్ శ్రీనాథరెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (ఇన్చార్జి) డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ పి.సత్యనారాయణ, జాయింట్ డైరెక్టర్ అమృత్, యూసిడి ఇన్‌చార్జి పి.ఓ డాక్టర్ లత, ఈఈ ఎ.ఎస్.ఎన్. ప్రసాద్, ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో నాగమల్లేశ్వరరావు, బాబూరావు, సీతారామయ్య

జిమ్నాస్టిక్స్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారుల సత్తా

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా బ్రహ్మానందం స్టేడియంలో 17,18న జరిగిన రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా ప్లేయర్స్ పతకాలతో మెరిశారు. అండర్-12 బాలికల పోటీల్లో కే శ్రీ సరయూ (విజయవాడ వీపీఎస్ పబ్లిక్‌స్కూల్) అన్ ఈవెన్ బార్‌లో స్వర్ణం, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో రజతం బ్యాలెన్ బీమ్ రజతం సాధించింది. వ్యక్తిగతంగానూ ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్‌లో మూడోస్థానం సాధించింది. అండర్-14 బాలుర విభాగంలో ఎల్ శ్రీరామ్ (విజయవాడ వీపీఎస్) హై బార్‌లో కాంస్యం, బాలికల విభాగంలో ఎస్ కీర్తన (సిద్ధార్థ) ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో స్వర్ణం, అన్‌ఈవెన్ బార్‌లో రజతం, బ్యాలెన్ బీమ్‌లో కాంస్యం, వ్యక్తిగత ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్‌లో మూడోస్థానం వశం చేసుకుంది. ఎస్.ప్రజ్ఞ (వీఆర్ సిద్ధార్థ) బ్యాలెన్ బీమ్‌లో రజతం సాధించింది. పతకాలు సాధించిన క్రీడాకారులను జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డీ నాగమల్లేశ్వరరావు, సెక్రటరీ బీ బాబూరావు, ట్రెజరర్ ఎల్ మురళీకృష్ణ, వీపీఎస్ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, కోచ్ రామ్మోహన్‌రావు అభినందించారు.

21,22న ఎన్టీఆర్ వర్శిటీ స్పోర్ట్సు సెలక్షన్స్

నగరంలోని ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాలలో బాస్కెట్‌బాల్ పురుషుల, విశాఖపట్నం ఎన్ఆర్ఐలో తైక్వాండో మహిళలు, 22 రాజమహేంద్రవరం జీఎస్ఎల్‌లో బ్యాడ్మింటన్ పురుష జట్ల సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్టు వర్శిటీ స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ ఈ త్రిమూర్తులు ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే మెడికల్, డెంటల్ ఆయుర్వేదిక్, హోమియోపతి, యునాని, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాల ఫిజికల్ డైరక్టర్లు ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు వేదిక వద్ద రిపోర్టు చేయాలన్నారు.

విలువలపై జగన్ మాట్లాడటం విడ్డూరం: గన్నె

వన్‌టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోర్టు వాయిదాలకు హాజరుకాని జగన్ విలువలు, విశ్వసనీయత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్ (అన్న) శనివారం ఒక ప్రకటనలో అన్నారు. అబద్ధాలు, అవినీతి సొమ్ము, శవాలు జగన్ పార్టీకి పునాదులంటూ తీవ్రంగా విమర్శించారు. బాబాయ్ హత్య, కోడికత్తి, గులకరాయి కేసులలో జగన్ చెప్పిన మాటలను ప్రజలు మరచిపోలేదన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో చేసిన అభివృద్ధి, రాష్ట్రానికి తిరిగొస్తున్న కంపెనీలు, సంక్షేమ పథకాలతో ప్రజలందరికీ మంచి జరుగుందన్న నమ్మకం ఏర్పడిందన్నారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ అబద్ధాలతో ప్రెస్‌మీట్లు ఏర్పాట్లు చేయటం మొదలు పెట్టాడన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటిని గెలిపించుకుందాం: యార్లగడ్డ సుచిత్ర

వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న టీడీపీ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర కోరారు. శనివారం విజయవాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే, మంత్రి, విద్యాధికుడుగా రాణించిన ఆయన్ను ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ సీటును సీఎం చంద్రబాబు కేటాయించారని, పట్టభద్రులు ఆయనకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.





జ్యోత్స్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సభలో పాల్గొన్న సీపీఎం, సీపీఐ రాష్ట్ర నేతలు

ఉద్యమ కెరటం గుళ్లపల్లి జ్యోత్స్న

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జ్యోత్స్న సంస్మరణ సభ
- హాజరైన రాజకీయ, మహిళ, ప్రజా సంఘాల నేతలు

మంగళగిరి సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల కోసం, సమాజాభివృద్ధి, సామాజిక చైతన్యం కోసం నిరంతరం పనిచేసిన జ్యోత్స్న హఠాన్మరణం సమాజానికి, వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సామాజిక ఉద్యమకారిణి జ్యోత్స్న సంస్మరణ సభ శనివారం మంగళగిరి బైపాస్‌లోని సీకే కన్వెన్షన్‌లో జరిగింది. వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల బాధ్యులు, మహిళా సంఘాల నేతలు, న్యాయవాదులు హాజరై జ్యోత్స్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ స్త్రీ, పురుష సమానత్వం కోసం జ్యోత్స్న నిరంతరం పోరాటం చేశారన్నారు. ఎంబీవీకే చైర్మన్ పీ మధు మాట్లాడుతూ జ్యోత్స్న దసరా ఉత్సవాలను కూడా సామాజిక అంశాలతో ముడిపెట్టి నిర్వహించారన్నార. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మాట్లాడుతూ జ్యోత్స్న తన తుదిశ్వాస వరకు మహిళల హక్కుల కోసం ఉద్యమించారన్నారు. మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ జ్యోత్స్న ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ తనకు 4 దశాబ్దాలుగా రాజేంద్రప్రసాద్ కుటుంబ సభ్యులతో పరిచయం ఉందన్నారు. సమాజంలో మార్పు కోసం జ్యోత్స్న నిరంతరం పాటుపడ్డారన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి టీ రజని మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీలో చదివేటప్పుడు జ్యోత్స్నతో పరిచయం ఏర్పడిందన్నారు. ఆ పరిచయంతోనే విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐలో పనిచేశామన్నారు. సార్వోత్తమ లైబ్రరీ కార్యదర్శి ఆర్.శారద, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్.ద్వారకనాథ్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణ్‌రెడ్డి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కేరళ హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు థామస్ అబ్రహం, మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాసు, జీ.సురేంద్ర, జీ.జితేంద్ర, వివిధ సంఘాల ప్రతినిధులు అక్కినేని వనజ, కే.స్వరూపరాణి, ఎ.సునీత, బి.శ్రీనివాసరావు, జీ.రామారావు, ఏవీ శేషసాయి, సీహెచ్ ఆశాలత, ఎం.జయకర్, పీ.మురళీకృష్ణ, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ ఖలీల్, పీ.శ్రీనివాసరావు, జగతి, శేషారత్నం, జీ.వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పక్కదారి పడితే

6ఏ చట్టంతో కఠిన చర్యలు

రేషన్ డీలర్ల నియామకాల ప్రక్రియపై ప్రత్యేక దృష్టి: ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా

కృష్ణలంక, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు పంపిణీ చేసే నిత్యావసర వస్తువుల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు పాల్పడితే 6 ఏ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా అధికారులను ఆదేశించారు. నిత్యావసర వస్తువుల పంపిణీ డీలర్ల నియామక ప్రక్రియపై శనివారం ఆమె రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థపై అధికారులు మరింత ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గత 3 నెలల్లో ఇలా అవకతవకలకు పాల్పడిన వారిపై 6 ఏ చట్టం కింద 54 కేసులు నమోదుతోపాటు 627 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. జిల్లాలో నూతన రేషన్ దుకాణాల ఏర్పాటుకు డీలర్ల నియామక ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అదనంగా 82 రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసి డీలర్లను నియమించాల్సి ఉందని ఈనెల 20న నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. అభ్యర్థులకు నవంబర్ 5న రాత పరీక్ష, 7న మౌఖిక పరీక్షలు నిర్వహించి 12న నియామక ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బియ్యంతో పాటు జొన్నల పంపిణీ

నిత్యావసర సరుకుల పంపిణీలో భాగంగా రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు జొన్నల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇకపై బియ్యంతో పాటు 3 కేజీల వరకు జొన్నలను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు.రైతుబజార్లలో వంటనూనెలు, కందిపప్పు, ఉల్లి అందుబాటులో ఉంచి ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.125 ఉన్న పామాయిల్‌ను రూ.110కి, రూ.135 ఉన్న సన్‌ఫ్లవర్ అయిల్‌ను రూ.124కు విక్రయించాలని, అలాగే కిలో కందిపప్పు రూ.150కే వినియోగదారులకు అందజేయాలన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్వో వి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లు, డీఎస్‌వో పాపారావు, ఆర్డీవోలు కె.చైతన్య, మాధురి, మండల తహసీల్దార్లు పాల్గొన్నారు.

సూరీడే తగలని చిరు ప్రాయం



- అర్ధరాత్రి వరకు చదువులు, టీవీలు, ఫోన్లు
- బారెడు పొద్దెక్కే వరకు మంచాలపైనే
- అధికశాతం చిన్నారుల్లో విటమిన్ డీ లోపం
- పెళుసుబారుతున్న ఎముకలు
- పెరుగుతున్న ఆస్టియో ఫోరోసిస్ బాధితులు



విపరీతంగా జుట్టు ఊడిపోతుండటం.. వాతావరణం చల్లగా ఉన్నా చెమటలు పట్టడం, ఆకలి తగ్గిపోవడం.. చిన్నారుల్లో ఇలాంటి లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు అప్రమత్తమవ్వాలి. బహుశా మీ పిల్లలు విటమిన్ -డీ లోపంతో బాధపడుతుండవచ్చు. ఈ లక్షణాలతో వైద్యులను సంప్రదిస్తున్న వారి సంఖ్య విజయవాడ నగరంలో ఇటీవల కాలంలో ఎక్కువగా ఉందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు వయస్సు ఎక్కువగా ఉన్నవాళ్లలోనే ఎముకల బలహీనత కనిపించేది ఇప్పుడు చిన్నారుల్లోనూ ఎముకల బలహీనత గుర్తిస్తున్నారు. 18ఏళ్లలోపు చిన్నారుల్లో ప్రతి వంద మందిలో 30 మంది విటమిన్ -డీ లోపంతో బాధపడుతున్నట్లు కాంప్రహెన్సివ్ నేషనల్ న్యూట్రిషన్ సర్వే (సీఎన్ఎన్ఎస్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ లోపం అంతిమంగా ఆస్టియోఫోరోసిస్‌కు దారితీస్తుంది. నేడు ప్రపంచ ఆస్టియోఫోరోసిస్ దినోత్సవం. ఈ సందర్భంగా విటమిన్ -డీ లోపం.. ఆస్టియోఫోరోసిస్‌పై వైద్య నిపుణులు చెబుతున్న వివరాలిలా ఉన్నాయి.

- విజయవాడ/ఆటోనగర్ - ఆంధ్రజ్యోతి

మారుతున్న జీవనశైలి కారణంగా రాత్రిపూట చదువుకుంటూనో.. టీవీలు, ఫోన్లు చూస్తూనో ఆలస్యంగా నిద్రపోవడం, ఉదయం 7 తర్వాతే మంచం నుంచి కిందకు దిగటం కారణంగా సూర్యకిరణాలకు చిక్కకుండా రోజు గడిచిపోతోంది. బాల్యం నుంచి 25 ఏళ్ల వరకు ఎముకల బలానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. శరీరానికి కాల్షియం సమృద్ధిగా అందాలంటే ఉదయపు సూర్యకిరణాలకు మించింది లేదని వైద్యనిపుణులు చెబుతున్నారు.

మారుతున్న జీవనశైలితోనే ప్రమాదం

డాక్టర్ ఎం. విజయ, రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్



విటమిన్ డీ లోపంతో బాధపడుతున్న చిన్నారుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. దీనికి ప్రధాన కారణం జీవనశైలిలో మార్పే. ఉదయం ఎండలో ఉండటం అలవాటు చేసుకోవాలి. గతంలో వయసురీత్యా ఆస్టియోఫోరోసిస్ కేసులొచ్చేవి. ఇప్పుడు చిన్నపిల్లల్లోనూ ఉంటుంది. మన శరీరం కాల్షియం స్వీకరించడానికి విటమిన్ డీ అవసరం. ఈ విటమిన్ ఆహారంలో తక్కువ. ఉదయం వేళ సూర్యకిరణాల్లో పుష్కలంగా ఉంటుంది. ఎముక గుల్లబారటం అనే ప్రక్రియ నెమ్మదిగా జరగడం వల్ల ఆస్టియోఫోరోసిస్‌ను గుర్తించడం కష్టం. అందుకే 65 ఏళ్లు బడిన స్త్రీలు, 70 ఏళ్లపై బడిన పురుషులు ఎముకల సామర్థ్యాన్ని తెలిపే బీఎండీ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. వ్యాధి తొలి దశలోనే గుర్తిస్తే కాపాడుకోవచ్చు.

నేడు ప్రపంచ ఆస్టియో ఫోరోసిస్ దినోత్సవం

విటమిన్ డీ కోసం ఏం చేయాలి..?

ఉదయం ఎండలో 5 నుంచి 30 నిమిషాలు ఉండటంతోపాటు కాల్షియం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తృణధాన్యాలు, చేపలు, గుడ్లు, పాలు, నువ్వులు, బాదం పప్పు వంటి వాటిని ఆహారంలో తప్పనిసరిగా తీసుకోవాలి. వ్యాయామం వల్ల కూడా ఎముకలు గట్టిగా తయారవుతాయి.

ఆస్టియోఫోరోసిస్ ఎలా వస్తుంది?

సాధారణంగా ఎముక నిర్మాణం, ఎదుగుదలలో భాగంగా ఎముకలోని పాతకణాలు పోయి కొత్త కణాలు చేరతాయి. దీన్ని ఎముక రీమాడలింగ్ అంటారు. ఇది చిన్నతనంలో మొదలై కౌమారదశ వరకు అతివేగంగా ఉండి సుమారు 30 ఏళ్లకు పూర్తిస్థాయికి చేరుతుంది. ఈ దశలో ఎముక దృఢంగా ఉంటుంది. 50 ఏళ్లు వచ్చేసరికి ఎముక సాంద్రత తగ్గి గుల్లబారుతుంది. జన్యుపరమైన కారణాలు, అధికంగా ఆల్కహాల్, పొగతాగడం, శారీరక శ్రమ లేకపోవడం, విటమిన్ డీ లోపం వల్ల ఆస్టియోఫోరోసిస్ వచ్చే అవకాశాలున్నాయి.

వ్యాధి లక్షణాలు

ఆస్టియోఫోరోసిస్ నెమ్మదిగా మనిషిని కుంగదీస్తుంది. చాలామందికి ఎముకలు విరిగేంతవరకు లక్షణాలు కనపడవు. నెమ్మదిగా నడుము వంగటం, వెన్నునొప్పి, ఎత్తు తగ్గడం, అలసట కొంతమందిలో కనిపిస్తాయి. అన్ని ఎముకలు దీని కారణంగా ప్రభావితమైనా వెన్నుపూస, తుంటి, మణికట్టు ఎముకలపై వ్యాధి ఎక్కువగా ఉంటుంది.

అకాడమీ పేరుతో కాలేజీ.. ఆర్ఐవో విచారణ



విచారణ చేస్తున్న ఆర్ఐవో

జగ్గయ్యపేట, అక్టోబరు 19: పట్టణంలో సీతారాంపురం లో ఆకాడమీ పేరుతో కళాశాల నిర్వహిస్తున్న విద్యాసంస్థపై తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు ఇంటర్ బోర్డు ఎన్టీఆర్ జిల్లా ఆర్ఐవో సీ.సత్యనారాయణరెడ్డి విచారణ జరిపారు. ఇంటర్ బోర్డులో నిబంధనలు అడ్డుపెట్టుకుని ముగ్గురు వ్యక్తులు మోసానికి పాల్పడినట్లు ఆరోపిస్తున్నారు. పట్టణంలో సీతారాంపురంలో కొత్త వెంకటేశ్వరస్వామి గుడి వద్ద లక్ష్య ఐఐటీ ఆకాడమీ పేరుతో ఐదేళ్లగా ముగ్గురు వ్యక్తులు కళాశాల నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అకాడమికి స్వల్ప దూరంలో ఉన్న విశ్వభారతి జూనియర్ కాలేజీ పేరున లోపాయికారిగా అడ్మిషన్లు ఇస్తున్నారు. ఆకాడమీ పేరుతో ఇంటర్‌తో పాటు జేఈఈ మెయిన్స్, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని చెప్పటంతో గత ఏడాది టెంత్ టాపర్లు అనేక మంది చేరారు. అడ్మిషన్ సమయం లో చూపించిన ఫ్యాకల్టీ ఎవరూ లేకపోవటంతో ఇంటర్‌లో మెరిట్ విద్యార్థుల ప్రమాణాలు దారుణంగా పడిపోయాయని ఆందోళన చెందుతున్నారు. పట్టణ ప్రముఖుడు ధరణికోట వెంకటరమణ ఫిర్యాదుతో ఆర్ఐవో సత్యనారాయణరెడ్డి విచారణకు వచ్చారు. పైకి లక్ష్య అకాడమీ బోర్డులు, లోపల రికార్డుల్లో మాత్రం విశ్వభారతి జూనియర్ కళాశాల అడ్మిషన్లున్నాయి. ఆర్ఐవో విశ్వభారతి కళాశాల కరస్పాండెంట్ పద్మను పిలిపించి విచారించారు. ఆకాడమీ పేరు తొలగించి, విశ్వభారతి జూనియర్ కళాశాల పేరునే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శుక్రవారం విచారణ జరిపి ఆర్ఐవో చెప్పిన మార్పులను ఇంకా మార్చలేదు.

మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేస్తాం

విద్యార్థులను లక్ష్య ఐఐటీ అకాడమీ ప్రతినిధుల మోసంపై మంత్రి లోకేష్‌కు ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేస్తామని పేరెంట్స్ కమిటీ ప్రతినిధి ధరణికోట వెంకటరమణ చెప్పారు. విశ్వభారతి జూనియర్ కళాశాలకు అనుబంధం అని చెప్పకుండా ప్రత్యేక కళాశాల అని భారీగా ప్రచారం చేశారన్నారు.

న్యాయం చేయండి

- ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు ఎయిడెడ్ ఉపాధ్యాయుల వినతి

గవర్నర్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): గత ప్రభుత్వ హయాంలో విలీనం కాబడి తీవ్రంగా నష్టపోయిన తమకు న్యాయం జరిగేలా నూతన ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఎయిడెడ్ ఉపాధ్యాయులు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు యూటీఎఫ్ కార్యాలయం వద్ద శనివారం వినతిపత్రం ఇచ్చారు. విలీన ఎయిడెడ్ ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. మోహన వెంకటకృష్ణ, ఎంపీ కృష్ణారెడ్డి తమ సమస్యలను ఎమ్మెల్సీకి వివరించారు. స్పందించిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు విద్యాశాఖాధికారులతో చర్చించి, మండలిలోనూ సమస్యలు లేవనెత్తుతానని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘ నేతలు ఏ సీతారామమూర్తి, హరిప్రసాద్, ఏ సురేష్‌కుమార్, జి. సత్యానందం, సీతమ్మ, ఆస్కార్, థామస్, ఎం. భానుప్రకాష్ ఉన్నారు.

పోలీసుల అదుపులో నకిలీ డాక్టర్

గన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం గన్నవరంలో హల్‌చల్ చేసిన అపరిచితుడిని అరెస్టు చేసినట్టు పోలీసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అతను తణుకు మండలం పైడిపర్రు గ్రామానికి చెందిన యిమ్మంది జ్యోతి శివ శ్రీ అలియాస్ డాక్టర్ సూర్య అంటూ పలు పేర్లతో మోసాలకు పాల్పడుతున్నాడన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో 20 వరకు కేసులు నమోదైనా లుగేళ్లు జైలు శిక్ష అనుభవించి 10నెలల క్రితం విడుదలైనట్లు పోలీసుల విచారణలో తెలిసిందన్నారు. డాక్టర్ అని చెప్పి మొబైల్ కావాలి, సరుకులు కావాలని చెప్పి షాపుల వద్ద నుంచి తాను ముందుగా నిర్ణయించుకున్న ప్రదేశానికి తెప్పించుకుని డబ్బులివ్వకుండా వెళ్లిపోయి ఎంతో మందిని మోసం చేశాడన్నారు. గతంలోనూ గన్నవరం గాంధీబొమ్మ సెంటర్‌లో ఇలా మొబైల్ తీసుకుని వెళ్లిపోయినట్లు తేలిందన్నారు. ఇతడి నుంచి సరుకులు, కారును సీజ్ చేసినట్టు తెలిపారు. తీరా చూస్తే ఆ కారు అతడిది కాదని తేలిందన్నారు. స్థానిక కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్టు ఎస్సై శివ ప్రసాద్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.510

హుండీల లెక్కింపు

ఘంటసాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) :ఘంటసాలలోని బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి ఆలయంలోని హుండీని బందరు డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో శనివారం లెక్కించారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాస్ (వాసు) మాట్లాడుతూ జలధీశ్వరస్వామి ఆలయ హుండీలోని నగదు లెక్కించగా, ఆరు నెలలకు రూ.93,552లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గొర్రెపాటి వెంకట రామకృష్ణ (ట్రస్టీ), అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నోటీసు

నా క్లయింటు కృష్ణాజిల్లా, అవనిగడ్డ మండలము. అవనిగడ్డ గ్రామ కాపురస్తుడు గుడివాక చిట్టి కోటయ్య గారి కుమారుడు శేషగిరిరావు నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది.

నా క్లయింటును తన అన్నగారైన గుడివాక అంకారెడ్డి గారి కుమారుడు శ్రీనివాసరావు నా క్లయింటుని మభ్యపెట్టి వ్యాపార అవసరాల కోసమని నా క్లయింటు యస్.బి.ఐ. నాగాయలంక బ్రాంచి అక్కౌంటు తాలూకు చెక్కు నెంబర్లు 73826 నుండి 73850 (25 చెక్కులు) మరియు అదే బ్యాంకు నందు ప్రద్యుమ్న పెట్రోలియం ప్రాడక్ట్స్ పేరు మీద ఉన్న కరెంటు అక్కౌంటు తాలూకు చెక్కు నెంబర్లు 732831 నుండి 732880 (50 చెక్కులు) అలాగే యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, నాగాయలంక బ్రాంచి నందు గల తన అక్కౌంటు తాలూకు చెక్కు నెంబర్లు 2034121 నుండి 2034140 మరియు 2018981 నుండి 2019000 (40 చెక్కులు), మరియు చెక్కు నెంబర్లు 566355 నుండి 566360 వరకు గల (6 చెక్కులు) అలాగే అదే బ్యాంకు నందు ఉన్న కరెంటు అక్కౌంటు తాలూకు చెక్కు నెంబర్లు 2006061 నుండి 2006160 (100 చెక్కులు) కేవలం నా క్లయింటు సంతకాలు మాత్రం కలిగి ఉన్న చెక్కులను తీసుకొనియున్నాడనియూ అంతేగాక ది. 11.8.2023న మోపిదేవి పోస్టాఫీసు నందు నా క్లయింటు పేరన నాన్ జ్యుడిషియల్ స్టాంపులు రూ.100/-లు విలువ గలవి 20 స్టాంపు పేపర్లు సి.ఆర్.నెం.15201 నుండి 15220 వరకు మరియు రూ.50/- విలువ గలవి 5 స్టాంపు పేపర్లు ఎ.ఎన్.903001 నుండి 903005 వరకు మొత్తం 25 స్టాంపు పేపర్లు నా క్లయింటు సంతకంలేకుండానే ఖాళీవి తీసుకొనినాడనియూ, అంతేగాక అవనిగడ్డ గ్రామములో నా క్లయింటుకు ఉన్న ఖాళీ స్థలంకు సంబంధించి అవనిగడ్డ సబ్ రిజిస్ట్రారువారి ఆఫీసులో ది. 30.7.1988వ తేదిన రిజిష్టరు కాబడిన దస్తావేజు నెం.2367/1988 ఒరిజనల్ మరియు మెట్ట భూమికి సంబంధించి అవనిగడ్డ సబ్ రిజిస్ట్రారువారి కార్యాలయములో ది. 15.3.1996వ తేదిన రిజిష్టరు కాబడిన దస్తావేజు నెం.383/1996 రుగల ఒరిజనల్ దస్తావేజు తీసుకొనియున్నాడనియూ, ఆ దర్మిలా ఇరువురి మధ్య మనస్పర్ధలు వచ్చి నందున ఖాళీ సంతకాలు కలిగినవి ఆధారం చేసుకొని శ్రీనివాసరావు గాని లేదా తనకు సంబంధించిన వ్యక్తులు ద్వారా కేసులు దాఖలు చేసి నా క్లయింటు ఆస్తులను కాజేయవలెననెడి దురుద్దేశ్యముతో ఉన్నాడనియూ నా క్లయింటు 1984 సం.లో వ్యాపారం మొదలు పెట్టిన నాటి నుంచి నేటివరకు ఎవరి వద్ద అప్పులు చేసి యుండలేదనియూ ఎవ్వరికి ఏ విధమైన ప్రామిశరీ నోట్లుగాని మరి ఏ ఇతర స్టాంపులు, చెక్కులు ఏమియూ యిచ్చి యుండలేదనియూ, సదరు శ్రీనివాసరావు పైన పేర్కొన్న చెక్కులుగాని, స్టాంపులుగాని ఆధారం చేసుకొని ఏమైన లావాదేవీలు చేసిన యెడల అవి నా క్లయింటును బైండు చేయజాలవు అనియూ కాబట్టి ఎవరైన పైన పేర్కొన్న డాక్యుమెంట్లు ఆధారం చేసుకొని ఏమైన చేసిన యెడల నా క్లయింటు చట్ట రీత్యా చర్య తీసుకోగలడని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

ఇమ్మిడిశెట్టి లక్ష్మీనారాయణ, యం.ఎ., ఎల్.ఎల్.బి.,
అడ్వకేటు,
శ్రీ లంకమ్మ అమ్మవారి గుడి దగ్గర,
అవనిగడ్డ. ✆ 99081 60589
అవనిగడ్డ
ది. 19-10-2024.

అడుగుకో గొయ్యి.. ఆదమరిస్తే అంతేనోయి


ప్రమాదకరంగా బోడగుంట రహదారి

(మోపిదేవి, ఆంధ్రజ్యోతి) : మోపిదేవి నుంచి రావివారిపాలెం, వెంకటాపురం, పెద కళ్లేపల్లి వెళ్లే జడ్పీ రహదారి అడుగడుగునా గోతులతో అధ్వానంగా తయారయింది. మండల కేంద్రమైన మోపిదేవికి పలు గ్రామాల ప్రజలు వందల సంఖ్యలో రాకపోకలు సాగి స్తుంటారు. గత ఐదేళ్లుగా కనీస మరమ్మతులు చేయలేదు. ప్రస్తుతం వర్షాలు తరచూ పడుతుండటంతో గోతుల నిండా వర్షపు నీరు నిలిచి ఉంటుంది. దాంతో వాహనచోదకులకు గొయ్యి ఎక్కడ ఉందో అర్థంకాక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

నాలుగేళ్లగా మరమ్మతులకు నోచుకోలేదు..

వెంకటాపురం నుంచి బోడగుంట, రావివారిపాలెం, మోపిదేవికి వెళ్లే నాలుగు కిలోమీటర్ల జడ్పీ రహ దారి నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. వర్షాల కారణం రోడ్డుపై ఉన్న గోతులు గమనించక విద్యార్థులు, రైతులు, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు.

-కొమ్ము సుధాకర్, బోడగుంట


రావివారిపాలెం రహదారి అధ్వానం

నిధులు మంజూరయ్యాయి..

మోపిదేవి నుంచి రావివారిపాలెం రోడ్డును బీటీ రహదారిగా మార్చేందుకు జిల్లా పరిషత్ నుంచి నిధులు రూ.10లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులకు సంబంధించి అగ్రిమెంట్ అవ్వాల్సి ఉంది. అయిన వెంటనే పనులు మొదలు పెడతాం.

- బొప్పన శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ


రైతు బజారులో ధరలపై ఆరా తీస్తున్న మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత

రూ.కోటితో రైతుబజారు, మార్కెట్ యార్డుల అభివృద్ధి

మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 19 : మచిలీపట్నం రైతుబజారు, మార్కెట్ యార్డులను రూ.కోటితో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత అన్నారు. మచిలీపట్నం రైతు బజారుతోపాటు మార్కెట్ యార్డును శనివారం సందర్శించారు. రైతు బజారులో పామాయిల్, ఉల్లిపాయలు, టమోటాలు, సన్‌ఫ్లవర్ ఆయిల్, బియ్యం, కందిపప్పు విక్రయాలను ఆమె పరిశీలించారు. సమస్యలను రైతులు, వినియోగదారులు రైతుబజారులో మరుగుదొడ్లు సరిగా లేవని డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ సరఫరా, కురగాయలు విక్రయించేందుకు ప్లాట్‌ఫాంలు తదితర సమ్యలను ఆమెకు వివరించారు. వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మార్కెట్ యార్డులోని గిడ్డంగిని ఆమె పరిశీలించారు. సెక్రటరీ మంజుల, అసిస్టెంట్ డైరెక్టర్ నిత్యానందంతో సమీక్షించారు. అనంతరం విజయసునీత మీడియాతో మాట్లాడుతూ మచిలీపట్నం రైతుబజారును రూ. 28 లక్షలతో అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే మార్కెట్ యార్డులోని గిడ్డంగులను రూ. 20 లక్షలతో అభివృద్ధి చేస్తామన్నారు. వీటితోపాటు ఉయ్యూరు రైతుబజారు, మార్కెట్ యార్డులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. వినియోగదారులకు అందుబాటులో ఉండే ధరలతో రైతుబజార్లలో నాణ్యమైన సరుకులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ వి. శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ టి. లావణ్య తదితరులు పాల్గొన్నారు.


నాగాయలంకలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ భూమి పూజ


శేరీవర్లపల్లిలో ఎమ్మెల్యే కాగిత శిలాఫలకం ఆవిష్కరణ

గ్రామీణాభివృద్ధే కూటమి లక్ష్యం

రోడ్ల నిర్మాణాల శంకుస్థాపనలో ఎమ్మెల్యేలు మండలి, కాగిత

నాగాయలంక, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు అనే ఆలోచనతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గ్రామాలాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. భావదేవరపల్లి, వక్కపట్లవారి పాలెం, నాగాయలంకల్లో పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. భావదేవరపల్లిలో సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో రూ.5.11కోట్లతో 8361 సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అంబటి శ్యామ్ ప్రసాద్, కైతేపల్లి అంకాలు, ఉపసర్పంచ్ తలశిల నాని, పంచాయతీ రాజ్ డీఈ పగడాల సురేష్‌బాబు, ఎంపీడీవో సీతారామ్ కుమార్ ఏఈ వాసుదేవరావు,కార్యదర్శులు మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

చల్లపల్లి : పాగోలులో రహదారి నిర్మాణానికి శనివారం నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు భూమిపూజ చేశారు. సర్పంచ్ తోట శ్రీనివాసరావు, జడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, ఎంపీటీసీ మేకా బంగారుబాబుపాల్గొన్నారు.

పెడన రూరల్: కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేపట్టిందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పుల్లపాడు, చోడవరం, శేరీవర్లపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రహదారుల అభివృద్ధిపై పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, పామర్తి వెంకటేశ్వరరావు, బొల్లా నాగేశ్వరరావు, గుడిశేవ రామారావు, పరసా రాంబాబు,బిల్లా శ్రీనివాస రావు, ఇన్‌చార్జి ఎంఈవో జయరామ, ఏఈ ధర్మయ్య పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల్లో మద్యం షాపులు తొలగించాలి

చల్లపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నివాస ప్రాంతాలు, రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటుచేసిన మద్యం షాపులు తొలగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు డిమాండ్ చేశారు. మూడో వార్డులో ఏర్పాటు చేసిన పవన్ మద్యం దుకాణాన్ని తొలగించాలని శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ, సీపీఎం, జనసేన నేతలు, స్థానికులు నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ డి.వనజాక్షికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, మద్యం దుకాణం కారణంగా స్థానికులు, ఆ రోడ్డుమీదుగా రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. నివాస ప్రాంతాల వద్ద దుకాణాలు ఏర్పాటు చేయవద్దంటూ ఎమ్మెల్యే సూచించినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవటంలేదని విమర్శించారు. కార్యక్రమంలోయద్ధనపూడి మధు, వెనిగళ్ల వసంతరావు, ఎండి.కరీముల్లా పాల్గొన్నారు.

అనుమతుల్లేని లేఅవుట్‌లపై కొరడా

మచిలీపట్నం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా లేఅవుట్‌లు వేసిన ప్రాంతాలపై మునిసిపల్ అధికారులు కొరడా ఝుళిపిస్తుపిస్తున్నారు. చిలకలపూడి ప్రాంతంలో అనుమతులు తీసుకోకుండా లేఅవుట్‌లు వేసి ప్లాట్‌లు విక్రయిస్తున్నారని కార్యాలయానికి పలు ఫిర్యాదులు అందాయి. దీంతో అధికారులు విచారణచేసి చిలకలపూడిలోని గూడౌన్‌ల సమీపంలోని లేఅవుట్‌కు ఎలాంటి అనుమతులు లేవని శనివారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

అవనిగడ్డ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నియోజకవర్గంలోని పట్టభద్రులు తమ ఓటును నమోదు చేయించుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. శనివారం అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయ సమీపంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఓటర్ల నమోదు డ్రైవ్ నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించుకోవాలని కోరారు. మండలి వెంకట్రామ్, కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, జనసేన నేతలు గుడివాక శేషుబాబు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి అప్సా విరాళం

పెడన రూరల్ : వరదబాధితుల సహాయార్థం ఏపీ ప్రైవేట్ స్కూల్ అసోసియోషన్(అప్సా) కృష్ణాజిల్లా శాఖ అధ్యక్షుడు ఎ.గౌరీప్రసాద్ టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబుకు 7,32,361 రూపాయాలచెక్కును అందించారు. వి.సుందరరామ్, కె.చంద్రశేఖర్, సాబుజాన్, వి.వి.శివప్రసాద్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ అందజేత

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం 45వ డివిజన్‌కు చెందిన పుప్పాల సూరిబాబుకు లివర్ మార్పిడికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.10లక్షలు మంత్రి కొల్లు రవీంద్ర అందజేశారు.

అవనిగడ్డ సబ్ డివిజన్‌లో పోలీసు యాక్ట్

అవనిగడ్డ : అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో నెలరోజుల పాటు సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. అనుమతులు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132,141,152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

పారదర్శక పాలన కూటమి ప్రభుత్వానికే సాధ్యం: ఎమ్మెల్యే వర్ల

పామర్రు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పేదలకు అద్భుతమైన సంక్షేమ పథకాలను అందిస్తూ, ప్రజలకు పారదర్శక పాలనందిస్తున్న కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఇటీవల జరిగిన మద్యం టెండర్ల విషయంలో ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటించడం వల్లనే ప్రతిపక్ష నేతలకు కూడా టెండర్లు దక్కాయన్నారు. చట్టప్రకారం వ్యాపారాలు చేసేందుకు ఎవరు ముందుకు వచ్చినా చంద్రబాబు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ప్రజాప్రభుత్వంగా సేవలందిస్తున్న తమపై బురదజల్లే విధంగా వైసీపీ నేతలు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, వల్లూరిపల్లి గణేష్, జనసేన ఎంపీటీసీ సభ్యుడు కూనపరెడ్డి సుబ్బారావు, పానుగంటి సందీప్ పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- పల్లెపండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము
- పలు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

గుడ్లవల్లేరు/నందివాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఎంతో వేగవంతంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా కుచికాయలపూడి, పోలిమెట్ల, శేరికల్వపూడి, అంగలూరు, విన్నకోట, చంద్రాల గ్రామాల్లో రూ. 2.69 కోట్లతో నిర్మించనున్న రహదారులకు ఆయన శంకుస్థాపన చేశారు. తొలుత కుచికాయలపూడి గ్రామంలో రూ1.21 కోట్లతో కుచికాయిలపూడి, పోలిమెట్ల, శేరికల్వపూడి రింగ్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలుగు నెలల కూటమి ప్రభుత్వ పాలనలో గుడివాడ నియోజకవర్గంలో ఇప్పటికి రూ. 23 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. గుడ్లవల్లేరు మండలంలోనే రూ. 7. 50 కోట్ల నిధులు పలు అభివృద్ధి పనులకు వెచ్చించామన్నారు. అతి త్వరలో నియోజకవర్గంలో స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించనున్నామన్నారు. కార్యక్రమాలలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, వల్లభనేని వెంకటరావు, కొడాలి రామరాజు, ఎ.ఈశ్వరరావు, అన్నపూర్ణమ్మ, జగన్మోహన రావు, వి.శివప్రసాద్, ఎ.రామ్మోహనరావు, బి.శివప్రసాద్, పొట్లూరి రవికుమార్, పోలవరపు వెంకటరావు, ఎస్వరూప్, ఎం.అనీల్, పేర్ని జగన్ తదితరులు పాల్గొన్నారు.

నందివాడ మండలంలో..

పల్లె పండుగ సందర్భంగా మండలంలోని తమిరిశ, అనుమనపూడి, పోలుకొండ, శంకరంపాడు, రుద్రపాక గ్రామాల్లో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శంకుస్థాపన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీలు దారుణమైన పరిస్థితులు ఎదుర్కొన్నాయని, కనీసం పంచాయతీలో ఏ పని చేయాలన్నా సర్పంచ్‌లు అప్పులు చేసి బిల్లులు రాకపోవటంతో తీవ్రఇబ్బందులు పడ్డారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దానేటి సన్యాసిరావు, పిన్నమనేని పూర్ణవీరయ్య (బాబ్జి), బూరగడ్డ శ్రీకాంత్, బొర్రా సత్యనారాయణ, అరెకపూడి వెంకట రామశాస్త్రి, ఉప్పల వెంకటేశ్వరరావు, ఎంపిడివో మల్లీశ్వరి, శ్రీనివాసరావు, నాగరాజు, మురళీ, జగన్ గ్రామాల ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





కుచికాయలపూడిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము.. పోలుకొండలో..

బొడ్డపాడు, చినపులిపాకకు నిరంతర విద్యుత్

- రూ. 70 లక్షలతో నిర్మాణ పనులకు శంకుస్థాపన

తోట్లవల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బొడ్డపాడు, చినపులిపాక ప్రజల నివాస గృహాలకు నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రత్యేక లైన్ నిర్మిస్తున్నట్లు సర్పంచ్ మూడే శివశంకర్ చెప్పారు. బొడ్డపాడు వద్ద ఆర్‌డీఎస్ఎస్ నిధులు రూ. 70 లక్షలతో చేపట్టే ప్రత్యేక విద్యుత్ లైన్ నిర్మాణ పనులకు సర్పంచ్ భూమి పూజ నిర్వహించారు. ఆర్‌డీఎస్ఎస్ స్కీం కింద బొడ్డపాడు, చినపులిపాక గ్రామాల గృహాలకు నిరంతరం విద్యుత్ అందించేందుకు వల్లూరుపాలెం సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక లైన్ నిర్మిస్తారని సర్పంచ్ తెలిపారు. పాత ట్రాన్స్‌ఫార్మర్‌లు తొలగించి పెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తారని, వ్యవసాయ, గృహ విద్యుత్ లైన్‌లు వేర్వేరుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సభ్యుడు శ్రీనివాసరావు, విద్యుత్ లైన్‌మెన్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ లైన్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ శివశంకర్

రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

పెదపారుపూడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ గ్రామ సభలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రంగారావు అన్నారు. శనివారం జమిదింట కుర్రులో రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనుకొల్లు శివరామ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సావిత్రి, కార్యదర్శి గంటా కృష్ణవేణి, మాజీ సర్పంచ్ జాస్తి రామచంద్రరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రంగారావు

మూర్తి ఆచూకీ కోసం విస్తృత గాలింపు

తోట్లవల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు వద్ద కృష్ణానదీ పాయలో గల్లంతైన సెప్టిక్‌ట్యాంకు వాహన డ్రైవర్ జగన్నాధం మూర్తి(39) ఆచూకీ కోసం శనివారం ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పోలీసులు గాలింపు నిర్వహించారు. ఎస్సై అర్జునరాజు ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, గజ ఈతగాళ్ల దేవరపల్లి వరకు కృష్ణానదీ పాయలో గాలించారు. 24 గంటలు గడిచినా మూర్తి జాడ లభించలేదని ఎస్సై తెలిపారు.



కరాటేలో షైనింగ్‌స్టార్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాఘవేంద్ర నగర్‌లోని శ్రీసాయి షైనింగ్ స్టార్ స్కూల్ విద్యార్థులు ఇటీవల చెన్నైలో జరిగిన 21వ ఆలిండియా మనాటే క-షిటో ర్యూ కరాటే చాంపియన్ షిప్-2024లో పాల్గొని గౌహార జహ, మోహిత్ నంద, తేజ రాఘవన్, తమిమీషాన్, లోకేశ్వర్, రేష్మశ్రీలు విజయం సాధించారు. విద్యార్థినీ, విద్యార్థులను, కోచ్ రామకృష్ణను ప్రిన్సిపాల్ లింగమనేని స్రవంతి, చైర్మన్ జగదీష్ అభినందించారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

సంప్రదాయబద్ధంగా అట్లతద్ది వేడుకలు

పామర్రు/ కూచిపూడి/ గుడ్లవల్లేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగింటి ఆడపడుచులు అట్లతద్ది వేడుకలను మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాయం సద్యవేళలో గౌరివ్రతం చేసి ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి ఆశీర్వచనాలు అందుకున్నారు. నూతన వధువులు దేవాలయాల్లో ప్రత్యేక పూజాదికాలు జరిపించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అట్లతద్ది వేడుకను సంప్రదాయపద్ధతిలో నిర్వహించి ప్రత్యేక ఉయ్యాలలో వనితలు, చిన్నారులు ఊగుతూ కేరింతల మధ్య సందడి చేశారు.



కూచిపూడిలో ముత్తైదువులకు వాయినాలు అందిస్తున్న మహిళ

కూచిపూడిలో..

గ్రామాల్లో అట్లతద్దె వేడుకలను మహిళలు సంప్రదాయబద్దంగా జరుపుకున్నారు. శనివారం వేకువజామునే వేడుకలు ప్రారంభమ య్యాయి. వివాహాలు జరిగిన ఆడ పిల్లలచే నోములు నోయించి ముత్తైదువులకు వాయినాలు అందించారు. గౌరీ నోముతోపాటు సంప్రదాయ పూజలు నిర్వహించారు. గోరింటాకులు పెట్టుకుని చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా ఉయ్యాల ఊగారు. సంప్రదాయ వంటకాలతో సహపంక్తి భోజనాలు చేశారు.

గుడ్లవల్లేరులో..

తెలుగు ఆడపడుచుల అచ్చతెలుగు పండుగ అట్లతద్ది వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించుకొన్నారు. ఊరూరా మహిళలు తద్దిపేరంటాళ్లు గౌరీదేవి అట్లవాయినాలు తీర్చుకొన్నారు. ఆడపిల్లలు గోరింటాకు పెట్టుకొని, ఊయలు ఊగుతూ సరదాగా గడిపారు.





గుడ్లవల్లేరులో.. పామర్రులో చిన్నారుల సందడి

గోవుల యజమానులపై చర్యలు తీసుకోండి

గుడివాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : యథేచ్ఛగా గోవులను రహదారులపై విడిచి పెడుతూ, అవి ప్రమాదానికి గురవ్వడానికి కారకులైన గోవుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజికవేత్త మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద రహదారిపై సేదతీరుతున్న గోవును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గోవు గాయాల పాలైంది. పశువైద్యులు గోవుకు వైద్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు యుద్ధప్రాతిపదికన గోవులను రహదారులపై విడిచిపెడుతున్న గోయజమానులపై చర్యలు తీసుకోవాలని సామాజికవేత్త రామకృష్ణ(ఆర్.కె) డిమాండ్ చేశారు.



గోవుకు వైద్యసేవలందిస్తున్న ఆర్.కె

విద్యాలయ డైరెక్టర్‌కు కలాం పురస్కారం

గుడివాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ అందించే డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారానికి స్థానిక విద్యాలయ ఉన్నత పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ ఎంపికయ్యారు. ఈ నెల 20న గుంటూరులో జరుగు కార్యక్రమంలో విజయభాస్కర్ కలాం పురస్కారాన్ని అందుకోనున్నారు.

వీరంకిలాకులో నేత్ర వైద్యశిబిరం రేపు

పమిడిముక్కల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పమిడిముక్కల మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం, మాక్సివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో వీరంకిలాకు శ్రీసంతాన సాయి బాబా సేవా మందిరంలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలవరకు ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి.ఏబు, బి, వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అన్నిశాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ఆరోగ్యశ్రీ కార్డుదారులకు కంటిపరీక్షలు జరిపి, శుక్లాలకు ఆపరేషన్లు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

పల్లెల ప్రగతికి చంద్రబాబు బాటలు

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పమిడిముక్కల/ పామర్రు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పల్లెల ప్రగతికి సీఎం చంద్రబాబు నేతృత్వంలో బాటలు వేస్తున్నారని, అందులో భాగంగానే గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మర్రివాడ, గురజాడ, తాడంకి, కపిలేశ్వరపురం గ్రామాల్లో 1.15 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 20 సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ, వైసీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని, దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా ప్రజా ప్రతినిధులు, నాయ కులు పనిచేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీ మేర సామాజిక పెన్షన్లు పెంచి అందిస్తున్నారని గుర్తు చేశారు. మిగిలిన హామీలు కూడా త్వరలో అమలు చేసే దిశగా చర్యలు తీసుకుం టున్నారన్నారు. సర్పంచ్‌లు వంపుగడల ఫ్రాన్సిస్, జంపాన ధనలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు రాజుల పాటి శ్రీనివాసరావు, నాయకులు, జక్కా శ్రీనివాసరావు, రాజేంద్రప్ర సాద్, కొల్లిపర బాబి, లింగమనేని బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు పట్టణంలో..



కపిలేశ్వరపురంలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

జాతిపిత మహాత్మగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం పరిపాలన అనుభవంగల ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తితో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నేరవేర్చాతున్నారని జనసేన పామర్రు నియోజక ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, టీడీపీ జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్‌లన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పామర్రు పట్టణంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ 1.91 కోట్లతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లకు శనివారం ఎంపీపీ దాసరి అశోక్ కుమార్‌తో కలసి భూమిపూజ చేశారు. సర్పంచ్ కె. కస్తూరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కెజ్యోతి, కూటమి నాయకులు, తాడిశెట్టి మధు, మంతెన రామాంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ లాజరస్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు చాట్ల పున్నమ్మ, ఎన్ఆర్ఈజీఎస్ ఏఈలు సురేష్, రామారావు, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, ఆరుమళ్ల అనిత, బావురిపల్లి పద్మజ, తెలుగు యువత అధ్యక్షుడు సందీప్, శ్రీనివాసరావు జనసేన నేతలు పాల్గొన్నారు.



పామర్రు పట్టణంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజలో పాల్గొన్న కూటమి నేతలు